



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 134 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఒంగోలు సోమవారం 19 జనవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE :134 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : ONGOLE MON 19 JANUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

# ఏపీ రాజధాని అమరావతే

- ఆయన బెంగళూరులో ఉంటే అదే రాజధాని అవుతుందా?: సీఎం చంద్రబాబు
- ఎన్టీఆర్ 30వ వర్ధంతి సభలో నివాళులర్పించిన సీఎం చంద్రబాబు
- ఎన్టీఆర్ సంక్షేమ బాటలోనే కూటమి ప్రభుత్వం పయనిస్తోందని వెల్లడి
- గత ప్రభుత్వ పాలనపై తీవ్ర విమర్శలు, 'క్రెడిట్ చోరీ' ఆరోపణల ఖండన
- 2027 జూన్ నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తామని స్పష్టం
- రాష్ట్రంలో రౌడీయిజం, అరాచకాలను ఉపేక్షించబోమని హెచ్చరిక




**పెన్ పవర్ డెస్క్:**ముఖ్యమంత్రి ఎక్కడ ఉంటే అదే రాజధాని అవుతుందా? మరి ఆయన (జగన్) ఎక్కువగా బెంగళూరులో ఉండేవారు, అటువంటప్పుడు దాన్నే రాజధానిగా ప్రకటించాల్సింది అంటూ ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర స్థాయిలో వ్యంగ్యాస్త్రాలు సంధించారు. రాజధాని విషయంలో గత పాలకులు సృష్టించిన గందరగోళానికి ప్రజలు సార్వత్రిక ఎన్నికల్లో గట్టిగా బుద్ధి చెప్పారని ఆయన అన్నారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, దివంగత ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు 30వ వర్ధంతి సందర్భంగా మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొని ప్రసంగించారు. ఎన్టీఆర్ ఆశయాలను కొనసాగిస్తూ రాష్ట్రాన్ని సర్వతోముఖాభివృద్ధి చేస్తానని ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

**ఏపీ రాజధాని అమరావతే**

రాజధానిపై ఐదేళ్లుగా నెలకొన్న అనిశ్చితికి తెరపడిందని చంద్రబాబు స్పష్టం చేశారు. "గత ఐదేళ్లుగా మన రాజధాని ఏదో చెప్పుకోలేని దుస్థితిలో బతికాం. మూడు రాజధానులంటూ గందరగోళం సృష్టించారు. కానీ ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారు. మూడు రాజధానుల నినాదం ఎక్కడైతే బలంగా వినిపించారో, అక్కడి ప్రజలు కూడా ఎన్డీయే అభ్యర్థులనే గెలిపించారు. ఇకపై ఎలాంటి అనుమానాలకు తావులేదు. ఎవరైనా ఏపీ రాజధాని ఏది అని అడిగితే, మనమంతా

వివరాలు 2లో..



## భారత్‌లో ఏఐ సేవలకు అమెరికన్లు ఎందుకు చెల్లిస్తున్నారు?

**పెన్ పవర్ డెస్క్:** భారత్ వంటి ఇతర దేశాల్లో కృత్రిమ మేధ సేవల కోసం అమెరికన్ వనరులను ఉపయోగిం చడాన్ని ట్రంప్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారో విమర్శించారు. చాట్‌జీపీటీ వంటి ప్లాట్‌ఫామ్‌లు అమెరికా భూభాగంపై ఇక్కడి విద్యుత్తును ఉపయోగించి పనిచేస్తున్నాయని.. కానీ, భారత్ వంటి దేశాల్లో పెద్ద సంఖ్యలో వినియోగదారులకు సేవలందిస్తున్నాయని పేర్కొన్నారు. ఓ అమెరికన్ ఛానల్‌లో

వివరాలు 2లో..



## నేతలారా.. ఏం జరగబోతోందో ఇప్పటికైనా గుర్తించండి

- అమ్ముడుపోయిన 'కోటరీల' మధ్య 'బందీలుగా' ఉన్న నాయకులారా ఆలోచించుకోండి: విజయసాయిరెడ్డి
- ప్రజా నాయకులకు విజయసాయిరెడ్డి సంచలన హెచ్చరిక
- వెనెజువెలా అధ్యక్షుడి ఉదంతాన్ని గుర్తు చేసిన వైనం
- అమ్ముడుపోయిన కోటరీల వల్ల ప్రమాదమని వ్యాఖ్య
- కోటరీల మధ్య నేతలు బందీలుగా ఉన్నారంటూ ఘాటు విమర్శ

**పెన్ పవర్ డెస్క్:**రాజ్యసభ మాజీ సభ్యుడు విజయసాయిరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. కొందరు ప్రజా నాయకులు తమ చుట్టూ ఉన్న కోటరీల మధ్య బందీలుగా ఉన్నారని, భవిష్యత్తులో వారికి ప్రమాదం పొంచి ఉందని ఆయన హెచ్చరించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో ఒక పోస్ట్ పెట్టారు.వెనెజువెలాలో భారీ ప్రజాదరణ ఉన్న అధ్యక్షుడిని, ఆయన భార్యను అమెరికా సులువుగా ఎత్తుకుపోయిందని గుర్తు చేశారు. అధ్యక్షుడి చుట్టూ ఉన్న ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్, ఇంటెలిజెన్స్ చీఫ్‌లు అమ్ముడుపోవడమే దీనికి కారణమని విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. భారీ సైన్యం, యుద్ధ విమానాలు ఉన్నా ఎలాంటి ప్రతిఘటన లేకుండా ఇది జరిగిందంటే దానికి కారణం "వారంతా అమ్ముడు పోవటమే కదా" అని ట్వీట్ చేశారు.

వివరాలు 2లో..



## బాంబు బెదిరింపు... ఇండిగో విమానం ఎమర్జెన్సీ ల్యాండింగ్

- ఇండిగో విమానానికి బాంబు బెదిరింపుతో కలకలం
- ఢిల్లీ నుంచి బాగ్డోగ్రా వెళుతుండగా లక్నోకు మళ్లింపు
- విమానం టాయిలెట్‌లో టిష్యూ పేపర్‌పై బెదిరింపు నోట్
- ప్రయాణికులందరూ సురక్షితంగా ఉన్నారని వెల్లడి
- బాంబ్ స్క్వాడ్‌తో విమానంలో విస్తృత తనిఖీలు

వివరాలు 2లో..

## ట్రంప్ మమ్మల్ని ఫూల్స్ ని చేశాడు ఇరాన్ నిరసనకారుల తీవ్ర ఆగ్రహం

- ఇరాన్ లో నిరసనకారులకు ట్రంప్ మద్దతు
- దాంతో మరింత రెచ్చిపోయి ఆందోళనలు చేసిన నిరసనకారులు
- ప్రభుత్వ అణచివేతలో 15,000 మంది మరణించారని ఆరోపణలు
- ట్రంప్ మాట మార్చి వెనక్కి తగ్గడంతో ప్రజల ఆగ్రహం
- తమను బలిపశువులను చేశారంటూ ట్రంప్‌పై ఇరానియన్ల విమర్శలు
- ఆర్థిక సమస్యలతో మొదలై రాజకీయ రూపుదాల్చిన ఆందోళనలు

**పెన్ పవర్ డెస్క్:**ఇరాన్‌లో జరిగిన ప్రభుత్వ వ్యతిరేక నిరసనల విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తమను నమ్మించి మోసం చేశాడని, ద్రోహానికి పాల్పడ్డాడని అక్కడి ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ట్రంప్ ఇచ్చిన హామీలను నమ్మి తాము రోడ్లపైకి వస్తే, ఆయన తమను ఫూల్స్ ని చేశాడని, మాట మార్చి తమను

వివరాలు 2లో..



## వైసీపీ హయాంలో పల్నాడులో రక్తం ప్రవహిస్తే, ఇప్పుడు పొలాలకు నీళ్లు పారుతున్నాయి

- వైసీపీ నేతలపై జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గొట్టిపాటి ఫైర్
- వ్యక్తిగత ఘర్షణలకు రాజకీయ రంగు పులుముతున్నారంటూ ఆగ్రహం
- పల్నాడు ప్రశాంతతకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక
- కుట్రల వల్లే వైసీపీ 11 సీట్లకు పరిమితమైందని విమర్శలు



**పెన్ పవర్ డెస్క్:**గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పల్నాడులో రక్తం ఏరులై పారితే, ప్రస్తుత కూటమి ప్రభుత్వ పాలనలో పంట భూములకు సాగునీరు పారుతోందని పల్నాడు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. పల్నాడులో ఫ్యాక్షన్, హత్యా రాజకీయాలపై వైసీపీ నేతలు చేస్తున్న అసత్య ప్రచారాన్ని ఖండిస్తూ ఆయన ఆదివారం అమరావతిలోని తన క్యాంపు కార్యాలయం నుంచి

వివరాలు 2లో..




## ఏపీ సమాచార కమిషన్‌కు కొత్త సారథులు...

### చీఫ్ కమిషనర్‌గా వజ్జా శ్రీనివాసరావు

- ఆర్టీఐ కమిషన్‌కు నూతన నియామకాలు.. ఐదుగురు కమిషనర్ల ఎంపిక
- ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్
- ముఖ్యమంత్రి నేతృత్వంలోని కమిటీ సిఫార్సులకు గవర్నర్ ఆమోదం
- నూతన కమిషనర్లు మూడేళ్లు లేదా 65 ఏళ్ల వయసు వరకు పదవిలో కొనసాగింపు

**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార హక్కు (ఆర్‌టీఐ) కమిషన్‌కు ప్రభుత్వం కొత్త సారథు లను నియమించింది. ప్రధాన సమాచార కమిషనర్‌గా (సీఐసీ)

వివరాలు 2లో..

## ఆరుగురు మావోయిస్టులు మృతి

### కొనసాగుతున్న ఎదురు కాల్పులు..

**పెన్ పవర్ డెస్క్:** ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు, పోలీసు బలగాలకు మధ్య ఎదురు కాల్పులు కొనసాగుతున్నాయి. కాల్పుల్లో ఇప్పటివరకు ఆరుగురు మావోయిస్టులు మృతి చెందినట్టు సమాచారం. నేషనల్ పార్క్ అడవుల్లో దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు, పశ్చిమ సబ్ జోనల్

వివరాలు 2లో..



## సినీ, రాజకీయాల్లో ఎన్టీఆర్‌ది చెరగని ముద్ర.. పేదల ఆకలి తెలిసిన నాయకుడు



- ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఘాట్ వద్ద నివాళులర్పించిన నందమూరి కుటుంబం
- సినీ, రాజకీయాల్లో ఎన్టీఆర్ చెరగని ముద్ర వేశారన్న బాలకృష్ణ
- బడుగు బలహీన వర్గాలకు అండగా నిలిచారని గుర్తుచేసుకున్న బాలయ్య
- ఎన్టీఆర్ స్ఫూర్తితోనే టీడీపీ ముందుకు సాగుతోందని వెల్లడి

వివరాలు 2లో..




## ప్రైవేట్ స్కూల్ ఫీజులు ఎలా పడితే అలా పెంచితే కుదరదు..

### త్వరలో కొత్త చట్టం

**పెన్ పవర్ డెస్క్:**తెలంగాణలో ప్రైవేట్ స్కూల్ ఫీజుల పెంపుపై కళ్లెం వేసేందుకు సిద్ధమైంది ప్రభుత్వం. ఎలా పడితే అలా పెంచి విద్యార్థుల ను, తల్లిదండ్రు లను ఇబ్బందులకు గురిచేయకుండా కట్టడి చేయనుంది. అందులో భాగంగా కొత్త చట్టం తీసుకొచ్చేందుకు సన్నాహాలు మొదలుపెట్టింది. ఫీజులు ఏటేటా పెంచకుండా రెండేళ్లకు ఒకసారి 8 శాతం లోపు పెంచుకునేలా చట్టం తీసుకురా నుంది.ఫీజుల పెంపు కోసం రాష్ట్ర ఫీ రెగ్యులేటరీ కమిటీ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. 8 శాతం లిమిట్ కు లోబడి పెంచేందుకు

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# బ్రేకులు ఫెయిల్

ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం మరోసారి అధికారంలోకి రావాలని చంద్రబాబు నాయుడు నిరంతరం శ్రమిస్తున్నారు. కానీ ఆయన శ్రమను ప్రజలు గుర్తిస్తున్నారు కానీ ఎమ్మెల్యేలు మాత్రం గుర్తించడం లేదు.ఎక్కువ మంది శాసనసభ్యులు తరచూ వివాదాల్లో చిక్కుకుంటున్నారు. పార్టీకి, ప్రభుత్వానికి తలనొప్పిగా మారారు. ఎమ్మెల్యేల పనితీరుపై ఎప్పటికప్పుడు నివేదికలు తెప్పించుకుంటూ హెచ్చరికలు చేస్తున్నప్పటికీ వారి వ్యవహార శైలిలో ఎలాంటి మార్పు కనిపించడం లేదు. కొత్తగా ఎన్నికయిన ఎమ్మెల్యేలు నిజంగా దోపిడీకి దిగుతున్నారన్న విమర్శలు సొంత పార్టీ కార్యకర్తల నుంచే వినిపిస్తున్నాయి. గతంలో ప్రధాన మీడియా ద్వారా వచ్చే విమర్శలు.. ఇప్పుడు సోషల్ మీడియా వేదికగా వస్తున్నాయి.

**మందలించారంటూ...**

ఇటీవల మంగళగిరి కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి అందిన నివేదిక మేరకు దాదాపు 48 మంది ఎమ్మెల్యేల పనితీరు సరిగా లేదని, ప్రభుత్వ కార్యక్రమాల్లోనూ పాల్గొనడం లేదని స్పష్టం చేసింది. అయితే వారిని చంద్రబాబు హెచ్చరించినట్లుగా వార్తలు వచ్చినప్పటికీ ఎమ్మెల్యే పనితీరు మాత్రం గాడిన పడలేదన్నది వాస్తవం. ఎందుకంటే ప్రతి పనికీ పర్సంటేజీలు. ప్రతి కార్యక్రమంలో అవినీతి. సొంత పార్టీ నేతలను కూడా వారు వదలకుండా దోపిడీకి తెరతీస్తున్నారన్న విమర్శలున్నాయి. చంద్రబాబు చూసీ చూడనట్లు వ్యవహరించడం వల్ల, లోకేశ్ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వల్లనే ఎమ్మెల్యేలు కొందరు నిర్భీతిగా తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ప్రచారం పార్టీలోనే జరుగుతుంది.

**అనేక మంది ఎమ్మెల్యేలపై...**

తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, విజయవాడ పార్లమెంటు సభ్యుడు కేశినేని చిన్నిల మధ్య తలెత్తిన వివాదంలోనూ ఇప్పటి వరకూ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కొలికపూడి శ్రీనివాసరావు ఎంపీపై తీవ్రమైన ఆరోపణలు చేశారు. అయినా సరే ఆయనను పిలిచి మందలించిన సందర్భం లేదు. అలాగే అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్ ప్రసాద్ విషయంలో కానీ, ఉత్తరాంధ్ర జిల్లాలోని కొందరు ఎమ్మెల్యేల పనితీరుపై అక్కడి కార్యకర్తలే నేరుగా ఆరోపణలు చేస్తున్నారు. అయినా పార్టీ నాయకత్వం పట్టించుకోవడం లేదు. ఇప్పటికే ఎమ్మెల్యేల పనితీరుతో పార్టీ బాగా డ్యామేజీ అయింది. ఇక రానున్న కాలంలో ఇలాంటి మెతక వైఖరిని అవలంబిస్తే మాత్రం ఖచ్చితంగా వచ్చే ఎన్నికల్లో టీడీపీ కి నష్టం తప్పదన్న సంకేతాలు ఆ పార్టీ కార్యకర్తల నుంచే వినిపిస్తున్నాయి.

## నేతలారా.. ఏం జరగబోతోందో ఇప్పటికైనా గుర్తించండి

- మొదటి పేజి తరువాయి

ఈ ఉదంతాన్ని ఉదాహరణగా చూపుతూ, "అమ్ముడు పోయిన కోటరీల మధ్య బందీలుగా ఉన్న ఓ ప్రజా నాయకులారా ఆలోచించుకోండి. భవిష్యత్తులో ఇక్కడ మీకూ ఏం జరగబోతోందో ఇప్పటికైనా గుర్తించండి!" అని ఆయన తన పోస్టులో ఘాటుగా హెచ్చరించారు. ప్రస్తుత రాజకీయ పరిణామాల నేపథ్యంలో విజయసాయిరెడ్డి చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.విజయసాయిరెడ్డి గతంలో పార్టీకి రాజీనామా చేసే సమయంలో, జగన్ పై విమర్శలు చేయడం తెలిసిందే. జగన్ చుట్టూ ఉన్న కోటరీ ఆయనను తప్పుదారి పట్టిస్తోందని ఆరోపించారు. ఈ క్రమంలో, వెనెజువెలా ఉదంతాన్ని ప్రస్తావిస్తూ, విజయసాయిరెడ్డి "కోటరీ" అంటూ ట్వీట్ చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## ఏపీ సమాచార కమిషన్‌కు కొత్త సారథులు...

- మొదటి పేజి తరువాయి

ప్రముఖ న్యాయవాది వజ్జా శ్రీనివాసరావును ఎంపిక చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ నేడు ఉత్తర్వులు జారీ చేశారు.శ్రీనివాసరావుతో పాటు మరో నలుగురిని సమాచార కమిషనర్లుగా నియమించారు. వీరిలో వి. శరత్ చంద్ర కల్యాణ చక్రవర్తి, గాజుల ఆదెన్న (అనంతపురం), ఒంటేరు రవిబాబు (కడప), పరవాడ సింహాచలం నాయుడు (విశాఖపట్నం) ఉన్నారు. నియమితులైన వారంతా న్యాయవాద వృత్తికి చెందిన వారు కావడం గమనార్హం. ఈ కొత్త కమిషనర్లు మూడేళ్ల పాటు లేదా వారికి 65 ఏళ్లు వచ్చే వరకు (ఏది ముందైతే అది) పదవిలో కొనసాగుతారు.ముఖ్యమంత్రి అధ్యక్షతన, మంత్రులతో కూడిన సెలెక్షన్ కమిటీ చేసిన సిఫార్సులకు గవర్నర్ ఆమోదం తెలపడంతో ప్రభుత్వం ఈ నియామకాలను ఖరారు చేస్తూ గెజిట్ విడుదల చేసింది. ప్రస్తుతం కమిషన్‌లో ముగ్గురు సభ్యులు ఉండగా, తాజా నియామకంతో కమిషన్ బలం గణనీయంగా పెరిగింది. ఈ నియామకాలతో సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తుల పరిష్కారం వేగవంతం అవుతుందని, ప్రభుత్వ కార్యకలాపాల్లో పారదర్శకత మరింత పెరుగుతుందని అధికార వర్గాలు భావిస్తున్నాయి.

# ఏపీ రాజధాని అమరావతే

- మొదటి పేజి తరువాయి

గర్వంగా, కాలర్ ఎగరేసి 'అమరావతి' అని చెప్పుకుందాం. ఇది మనందరి రాజధాని, ప్రజా రాజధాని, దేవతల రాజధాని" అని చంద్రబాబు ఉద్ఘాటించారు.

**యుగపురుషుడికి నివాళి**

ఎన్టీఆర్ తెలుగు జాతి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయే ఏకైక నాయకుడని చంద్రబాబు కొనియాడారు. "ఎన్టీఆర్ మనకు భౌతికంగా దూరమై 30 ఏళ్లు గడిచినా, ఆయన స్ఫూర్తి మనతోనే ఉంది. ఒకప్పుడు మదరాసీలుగా పిలవబడిన తెలుగువారి ఆత్మగౌరవాన్ని ఆయన ఎవరెస్ట్ శిఖరమంత ఎత్తుకు తీసుకెళ్లారు. పార్టీ స్థాపించిన కేవలం 9 నెలల్లోనే అధికారంలోకి వచ్చి చరిత్ర సృష్టించిన యుగపురుషుడు ఆయన. విద్యావంతులను, మేధావులను రాజకీయాల్లోకి ఆహ్వానించి సామాజిక న్యాయానికి పెద్దపీట వేశారు" అని చంద్రబాబు గుర్తుచేసుకున్నారు.

**ఎన్టీఆర్ బాటలోనే సంక్షేమం**

ఎన్టీఆర్ ప్రారంభించిన సంక్షేమ పథకాలే తమ ప్రభుత్వానికి స్ఫూర్తి అని చంద్రబాబు తెలిపారు. "ఆనాడు ఆయన రూ.2కే కిలో బియ్యం ఇచ్చి దేశంలో ఆహార భద్రతకు నాంది పలికారు. నేడు మేము అన్న క్యాంటీన్ల ద్వారా రూ.5కే నాణ్యమైన భోజనం అందిస్తున్నాం. ఆయన రూ.35తో ప్రారంభించిన పింఛనును ఇప్పుడు రూ.4 వేలకు పెంచి గౌరవంగా అందిస్తున్నాం. ఆయన చూపిన బాటలోనే పేదలకు పక్కా ఇళ్లు నిర్మిస్తున్నాం. ఇటీవల 3 లక్షల గృహ ప్రవేశాలు చేయించాం, ఉగాది నాటికి మరో 5 లక్షల గృహ ప్రవేశాలు చేయిస్తాం" అని వివరించారు.

**భూ హక్కులకు తిరుగులేని భరోసా**

ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించడమే తమ ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. "గత ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను రద్దు చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం. నాడు ఎన్టీఆర్ భూ రికార్డుల్లో పారదర్శకత కోసం మునసబు, కరణం వ్యవస్థను రద్దు చేస్తే, గత పాలకులు కొత్త అధికారులను సృష్టించి ప్రజల ఆస్తులు కొట్టేయాలని చూశారు. వారి కుట్రలను భగ్నం చేశాం. రాజముద్రతో కొత్త పట్టాదారు పాసు పుస్తకాలు అందిస్తున్నాం. రీ-సర్వేను పక్కాగా పూర్తిచేసి, బ్లాక్ చైన్, క్యూఆర్ కోడ్ టెక్నాలజీతో భూ రికార్డులను ఎవరూ ట్యాంపర్ చేయకుండా పటిష్టమైన భద్రత కల్పిస్తాం" అని ఆయన హామీ ఇచ్చారు.

**అభివృద్ధి, పెట్టుబడులే లక్ష్యం**

రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు ఆకర్షించడమే తమ లక్ష్యమని చంద్రబాబు అన్నారు. "దేశంలోకి వస్తున్న పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకే వస్తున్నాయి. నిన్ననే కాకినాడలో ఏఎమ్ గ్రీన్ అమోనియా ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశాం. ఇదీ తెలుగువారి సత్తా. కానీ కొందరు దీన్ని కూడా 'క్రెడిట్ చోరీ' అని విమర్శిస్తున్నారు. భోగాపురం విమానాశ్రయం కోసం మేము 2,500 ఎకరాలు సేకరిస్తే, గత ప్రభుత్వం ఐదేళ్లు దాన్ని పక్కన పడేసింది. అమరావతిని స్మశానం అన్నారు. వారి క్రెడిట్ అంతా ఇసుక, మద్యం, మైనింగ్, డ్రగ్స్, గంజాయి మాత్రమే" అని ఆయన విమర్శించారు.

**జలయజ్ఞానికి పునరంకితం**

ఎన్టీఆర్ స్ఫూర్తితోనే సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. "ఎన్టీఆర్ హయాంలో తెలుగుగంగ, గాలేరు-నగరి వంటి ప్రాజెక్టులకు పునాది పడింది. మేము అదే స్ఫూర్తితో రాష్ట్రాన్ని జలకళతో నింపుతాం. ఈ ఏడాదిలోనే వెలుగొండ, ఉత్తరాంధ్ర ప్రాజెక్టులను పూర్తి చేసి చూపిస్తాం. 2027 జూన్ నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం. శ్రీకాకుళంలోని వంశధార నుంచి నెల్లూరులోని పెన్నా వరకు నదులను అనుసంధానం చేసి ప్రతి ఎకరాకు నీళ్లిస్తాం" అని ప్రకటించారు.

**శాంతిభద్రతలపై ఉక్కుపాదం**

రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని చంద్రబాబు హెచ్చరించారు. "రాష్ట్రంలో ఫ్యాక్షన్ రాజకీయాలను టీడీపీ అంతం చేసింది. ఇప్పుడు కొంతమంది పొలిటికల్ రౌడీలు తయారయ్యారు.

ముఖ్యంగా పల్నాడులో గిల్లికజ్జాలు పెట్టుకుని రెచ్చగొడుతున్నారు. ఇలాంటివి మా దగ్గర నడవవు. నా దగ్గర తోక తిప్పలేరు. రాజకీయ ముసుగులో అరాచకాలకు పాల్పడితే ఊరుకునే ప్రసక్తే లేదు. సోషల్ మీడియాలో వ్యక్తిత్వ హననానికి పాల్పడితే పట్టుకొచ్చి బట్టలూడదీస్తాం. పల్నాడును ప్రక్షాళన చేసి శాంతియుత ప్రాంతంగా మారుస్తాం" అని తీవ్ర స్వరంతో హెచ్చరించారు.

**కార్యకర్తలే బలం.. కేంద్రంతో సమన్వయం**

కోటి మంది కార్యకర్తలున్న టీడీపీకి దేశంలో ఏ పార్టీకి లేనంత బలముందని చంద్రబాబు అన్నారు. "కష్టకాలంలో జై టీడీపీ, జై సీబీఎన్ అని నినదించిన కార్యకర్తలకు నా జీవితాంతం రుణపడి ఉంటాను. వారిని గౌరవంగా చూసుకునే బాధ్యత నాది" అని భరోసా ఇచ్చారు. జాతీయ రాజకీయాల్లో టీడీపీ ఎప్పుడూ కీలక పాత్ర పోషించిందని, ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్రానికి సంపూర్ణ సహకారం అందిస్తున్నారని, తాము కూడా కేంద్రానికి అదే స్థాయిలో సహకరిస్తామని తెలిపారు. "దేశం బాగుండాలి, రాష్ట్రం ముందుండాలి, తెలుగుజాతి అన్నింటా ముందుండాలన్నదే నా ఆకాంక్ష" అని తన ప్రసంగాన్ని ముగించారు.

## బాంబు బెదిరింపు... ఇండిగో విమానం ఎమర్జెన్సీ ల్యాండింగ్

ఇండిగో విమానంలో బాంబు ఉందంటూ వచ్చిన బెదిరింపుతో తీవ్ర కలకలం రేగింది. ఢిల్లీ నుంచి బెంగాల్ లోని బాగ్డోగ్రా వెళుతున్న విమానాన్ని అత్యవసరంగా లక్నోకు మళ్లించారు. ఈ ఘటన ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. ఆ సమయంలో విమానంలో ప్రయాణికులు, సిబ్బందితో సహా మొత్తం 238 మంది ఉన్నారు.

వివరాల్లోకి వెళితే, ఇండిగో విమానం 6జు-6650 ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి బాగ్డోగ్రాకు బయలుదేరింది. విమానం గాల్లో ఉండగా, టాయిలెట్‌లోని ఒక టిష్యూ పేపర్‌పై బాంబు ఉన్నట్లు చేతితో రాసిన బెదిరింపు నోట్‌ను సిబ్బంది గుర్తించారు. వెంటనే పైలట్ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఘూజ)ని ఉదయం 8:46 గంటలకు అప్రమత్తం చేశారు. అధికారుల సూచన మేరకు విమానాన్ని సమీపంలోని లక్నో విమానాశ్రయానికి మళ్లించారు. ఉదయం 9:17 గంటలకు విమానం లక్నోలో సురక్షితంగా ల్యాండ్ అయింది. అనంతరం విమానాన్ని వెంటనే ఐసోలేషన్ బేకు తరలించి ప్రయాణికులందరినీ సురక్షితంగా కిందకు దించారు. సమాచారం అందుకున్న బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్, సీఐఎస్ఎఫ్ బృందాలు విమానాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నాయి. ప్రయాణికులు, సిబ్బంది అందరూ సురక్షితంగా ఉన్నారని అధికారులు తెలిపారు.

ఈ ఘటనపై ఇండిగో ఎయిర్‌లైన్స్ స్పందించింది. ప్రయాణికుల భద్రతకు తాము అత్యంత ప్రాధాన్యత ఇస్తామని, దర్యాప్తు సంస్థలకు పూర్తిగా సహకరిస్తున్నామని తెలిపింది. ప్రయాణికులకు తాత్కాలికంగా అసౌకర్యం కలగకుండా ఆహారం, ఇతర ఏర్పాట్లు చేస్తున్నామని సంస్థ ప్రతినిధి వివరించారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

## సినీ, రాజకీయాల్లో ఎన్టీఆర్‌ది చెరగని ముద్ర.. పేదల ఆకలి తెలిసిన నాయకుడు

దివంగత ముఖ్యమంత్రి, టీడీపీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు వర్ధంతి సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు ఘనంగా నివాళులర్పించారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ఘాట్ వద్ద ఎన్టీఆర్ కుమారుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, ఏపీ సీఎం చంద్రబాబు అర్ధాంగి నారా భువనేశ్వరి, నందమూరి రామకృష్ణ, సుహాసిని తదితరులు పుష్పాంజలి ఘటించారు.

ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ.. సినీ, రాజకీయ రంగాల్లో ఎన్టీఆర్ తనదైన చెరగని ముద్ర వేశారని అన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడిన బాలకృష్ణ, ఎన్టీఆర్ ప్రస్థానాన్ని గుర్తుచేసుకున్నారు. "మహానుభావులు కావాలంటే ఎంతో శ్రమ, దీక్ష అవసరం. ఆ లక్షణాలు ఎన్టీఆర్‌లో పుష్కలంగా ఉన్నాయి. సూర్యచంద్రులు ఉన్నంతకాలం ఆయన బతికే ఉంటారు. సినిమాల్లో ఎవరూ చేయలేని పాత్రలు చేసి, నటనలో పరకాయ ప్రవేశంతో ఎన్నో ప్రయోగాలు చేశారు" అని కొనియాడారు. తెలుగుదేశం పార్టీని స్థాపించి రాజకీయాల్లో సంచలనం సృష్టించారని, రాజకీయాలను కొందరికే పరిమితం కాకుండా అందరికీ చేరువ చేశారని తెలిపారు.

పేదల ఆకలి బాధ తెలిసిన నాయకుడు కాబట్టే బడుగు, బలహీనవర్గాలకు అండగా నిలిచారని బాలకృష్ణ అన్నారు. అప్పట్లో ఆయన తీసుకొచ్చిన పథకాలే ఇప్పుడు దేశవ్యాప్తంగా అమలవుతున్నాయని చెప్పారు. తెలుగు గంగ, గాలేరు నగరి వంటి ప్రాజెక్టులతో ప్రజలకు మేలు చేశారని, ఆయన స్ఫూర్తితోనే టీడీపీ ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు. నందమూరి రామకృష్ణ మాట్లాడుతూ.. తెలుగువారి గుండెచప్పుడు, కళామతల్లి ముద్దుబిడ్డ ఎన్టీఆర్ అని, తెలుగుజాతి కీర్తిని ప్రపంచానికి చాటిచెప్పారని అన్నారు.

## భారత్‌లో ఏఐ సేవలకు అమెరికన్లు ఎందుకు చెల్లిస్తున్నారు?

- మొదటి పేజి తరువాయి

వైట్ హౌస్ మాజీ ప్రధాన వ్యూహకర్త స్టీవ్ బానన్‌తో జరిగిన ఇంటర్వ్యూలో నవారో ఈమేరకు వ్యాఖ్యలు చేశారు."భారత్‌లో ఏఐ సేవల కోసం అమెరికన్లు ఎందుకు డబ్బులు చెల్లిస్తున్నారు? చాట్‌జీపీటీ అమెరికా గడ్డపై పనిచేస్తోంది. ఇక్కడి విద్యుత్తును ఉపయోగిస్తోంది. కానీ, భారత్, చైనా ఇలా ప్రపంచవ్యాప్తంగా ఇతర దేశాల్లో పెద్దఎత్తున వినియోగదారులకు సేవలు అందిస్తోంది" అని నవారో వ్యాఖ్యానించారు. అదే విధంగా అమెరికాలో వ్యవసాయ భూముల కొనుగోళ్లపై కూడా ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. విదేశీ సంస్థలు స్థానిక వ్యవసాయ భూములను వాస్తవ ధర కంటే పది రెట్లు ఎక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నాయని ఆరోపించారు. ఇటువంటి ధోరణులు అమెరికాలో ఆహార ధరల పెంపునకు కారణం కావొచ్చన్నారు.

అమెరికా (ఖూూ)తో వాణిజ్యం, రష్యాతో కొనసాగిస్తున్న విధానాలపై భారత్‌ను లక్ష్యంగా చేసుకుని నవారో గతంలోనూ పలు సందర్భాల్లో విమర్శలు గుప్పించారు. భారత్ అత్యధిక సుంకాలు విధించడం వల్ల అమెరికా ఉద్యోగాలు దెబ్బతింటున్నాయని ఆరోపించారు. లాభం కోసమే ఆ దేశం రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోందని, ఉక్రెయిన్‌తో మాస్కో చేస్తున్న యుద్ధాన్ని పోషిస్తోందని నోరు పారేసుకున్నారు. భారత్ ఈ వ్యాఖ్యలను కొట్టిపారేసింది. రష్యా (=బంంఖు) నుంచి తాము చమురు కొనుగోలు చేస్తోంది కేవలం ఇంధన భద్రత కోసమేనని పేర్కొంది.

## వైసీపీ హయాంలో పల్నాడులో రక్తం ప్రవహిస్తే, ఇప్పుడు పొలాలకు నీళ్లు పారుతున్నాయి

- మొదటి పేజి తరువాయి

ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన చిన్న ఘర్షణకు రాజకీయ రంగు పులిమి, టీడీపీపై బురద చల్లేందుకు వైసీపీ కుట్రలు పన్నుతోందని ఆయన తీవ్రంగా మండిపడ్డారు.ఐదేళ్ల వైసీపీ పాలనలో ఫ్యాక్షన్, అక్రమ మైనింగ్, దౌర్జన్యాలతో పల్నాడు ప్రాంతం వల్లకాడుగా మారిందని మంత్రి గొట్టిపాటి విమర్శించారు. గురజాల నియోజకవర్గంలోని మాచవరం మండలం పిన్నెల్లి గ్రామానికి చెందిన 300 మంది భయంతో ఊరు విడిచి పారిపోయారని గుర్తుచేశారు. ఒక్క పిన్నెల్లి గ్రామంలోనే జగన్ ఐదేళ్ల పాలనలో 12 మందిని హత్య చేశారని, వారిలో ఎస్సీ, బీసీలు కూడా ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమ మైనింగ్ కోసం తవ్విన గుంతల్లో పడి ఏడెనిమిది మంది చనిపోయినా నాటి ప్రభుత్వం పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. బాధితులను పరామర్శించడానికి ప్రతిపక్ష నేతగా చంద్రబాబు పల్నాడుకు వస్తే, ఆయనను అడ్డుకునేందుకు వైసీపీ నేతలు ప్రయత్నించిన విషయాన్ని ఈ సందర్భంగా మంత్రి గుర్తుచేశారు.

చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, గతంలో ఊరు విడిచి వెళ్లిన వారంతా ధైర్యంగా తిరిగి గ్రామాలకు వస్తున్నారని గొట్టిపాటి తెలిపారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టాక పల్నాడు రైతులకు సాగునీటి కష్టాలు తీర్చామని, పొలాలకు నీటిని అందిస్తున్నామని వివరించారు. గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలన్నదే చంద్రబాబు ఆశయమని అన్నారు.

వైసీపీ కుట్రపూరిత, విధ్వంసకర రాజకీయాల వల్లే ప్రజలు ఆ పార్టీని కేవలం 11 సీట్లకే పరిమితం చేశారని, అయినా వారికి బుద్ధి రాలేదని ఎద్దేవా చేశారు. అక్రమ సంపాదనతో పుట్టిన పార్టీ వైసీపీ అని, తెలుగోడి

ఆత్మగౌరవం కోసం పుట్టింది తెలుగుదేశం పార్టీ అని మంత్రి గొట్టిపాటి వ్యాఖ్యానించారు. అధికారం చేపట్టిన నాటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ హత్యా రాజకీయాలను ప్రోత్సహించిందని ఆరోపించారు. గ్రామాల్లో జరిగే హత్యలకు రాజకీయ రంగు పులిమి, ఎవరు చనిపోతారా అని ఎదురుచూస్తూ లబ్ధి పొందాలని వైసీపీ నేతలు చూస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో పల్నాడులో ప్రశాంత వాతావరణం నెలకొందని, దీనికి ఎవరు భంగం కలిగించినా చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ఫ్యాక్షన్, హత్యా రాజకీయాలపై ఉక్కుపాదం మోపుతామని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై పోలీసు శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఫ్యాక్షన్ లేని పల్నాడును నిర్మించి, ప్రతి రైతు కుటుంబంలో ఒక ఉద్యోగం కల్పించడమే తమ లక్ష్యమని మంత్రి గొట్టిపాటి పునరుద్ఘాటించారు.

## ప్రైవేట్ స్కూల్ ఫీజులు ఎలా పడితే అలా పెంచితే కుదరదు..

- మొదటి పేజి తరువాయి

మాత్రమే అనుమతి ఉంటుంది. ఒక స్కూలుకు ఫీజు నిర్ణయించే ముందు ముఖ్యమైన డాక్యుమెంట్లు, స్కూల్ కు వస్తున్న రెవెన్యూ, ఆదాయం, ఖర్చుల వివరాలను పరిశీలించి కమిటీ అనుమతించనుంది. ప్రైవేట్, కార్పోరేట్ స్కూల్స్ ఫీజుల పెంపు నియంత్రణకు సంబంధించిన ప్రతిపాదనలు ఇప్పటికే ప్రభుత్వానికి చేరింది. వచ్చే కేబినెట్ మీటింగ్ లో దీనిపై చర్చించనున్నారు. రాష్ట్రంలో ఉన్న11 ప్రైవేట్, కార్పోరేట్ పాఠశాలల్లో ఎక్కువ భాగం ఉన్న బడ్జెట్ స్కూల్స్ ఈ ప్రతిపాదనను వ్యతిరేకిస్తున్నాయి. ఏడాదికి 5 శాతం చకునేలా అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తున్నాయి. రెండు సంవత్సరాలకు ఒకసారి ఎనిమిది శాతం ఫీజు పెంపుదల అనేది ఆమోదయోగ్యం కాదని ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ చెబుతోంది. పెరుగుతున్న ధరలు, ఖర్చులు, టీచర్లు, సిబ్బంది జీతాల పెంపుదల.. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని ఏడాదికి ఒకసారి 5 శాతం ఫీజులు పెంచుకునేలా అనుమతివ్వాలని కోరుతున్నాయి. తెలంగాణ విద్యా కమిషన్ ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో, ప్రైవేట్ ప్రొఫెషనల్ కాలేజీలకు ఫీజులను నిర్ణయించే తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీజు రెగ్యులేటరీ కమిటీ తరహాలో, ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి 10 నుండి 15 శాతం ఫీజు పెంపును సిఫార్సు చేసింది.ఫీజు పెంపు కోసం, రాష్ట్ర స్థాయిలో సుప్రీంకోర్టు లేదా హైకోర్టు మాజీ న్యాయమూర్తి నేతృత్వంలో తెలంగాణ ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ స్కూల్స్ ఫీజు రెగ్యులేటరీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని కమిషన్ సిఫార్సు చేసింది. ఈ కమిటీలో సీనియర్ విద్యావేత్తలు, ప్రొఫెసర్లు, చార్టర్డ్ అకౌంటెంట్లు, పాఠశాల నిర్వహణ సభ్యులుగా ఉండాలని సూచించింది.

కలెక్టర్ నేతృత్వంలో జిల్లా వారీగా ఫీజు నియంత్రణ కమిటీని కూడా కమిషన్ సిఫార్సు చేసింది. కన్జూమర్ ఇండెక్స్ ను పరిగణనలోకి తీసుకుని ఫీజు పెంపు ప్రతిపాదించడమే కాకుండా, కమిషన్ మూడు సంవత్సరాల లాక్-ఇన్ వ్యవధిని సూచించింది.

## ట్రంప్ మమ్మల్ని ఫూల్స్ ని చేశాడు

- మొదటి పేజి తరువాయి

నట్టేట ముంచాడని ఆవేదన చెందుతున్నారు.ఇరాన్‌లో ఆర్థిక సమస్యలపై మొదలైన ఆందోళనలు ప్రభుత్వ మార్పు డిమాండ్‌తో ఉద్ధృతంగా మారినప్పుడు, ట్రంప్ సోషల్ మీడియా వేదికగా నిరసనకారులకు మద్దతు ప్రకటించారు. "త్వరలోనే సహాయం అందుతుంది" అని, శాంతియుత నిరసనకారులపై హింసకు పాల్పడితే అమెరికా చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. దీంతో అమెరికా సైనిక చర్య తీసుకుంటుందనే ఆశతో చాలామంది నిరసనల్లో పాల్గొన్నారు.అయితే, ఇరాన్ ప్రభుత్వం ఈ నిరసనలను ఉక్కుపాదంతో అణచివేసింది. స్నైపర్ ఫైరింగ్, మెషీన్ గన్లతో జరిపిన దాడుల్లో వేలాది మంది ప్రాణాలు కోల్పోయారని (దాదాపు 15,000 మంది మరణించారని అంచనా) నివేదికలు వచ్చాయి. అయితే, ట్రంప్ తన వైఖరిని మార్చుకుని, ఇరాన్ ప్రభుత్వం హత్యలు ఆపేస్తామని హామీ ఇచ్చిందని, సైనిక చర్య ఉండదని ప్రకటించారు. ఈ పరిణామంతో నిరసనకారులు తీవ్ర నిరాశకు లోనయ్యారు.ట్రంప్ చర్యలపై ు×వీజు పత్రికతో పలువురు ఇరానియన్లు తమ ఆవేదనను పంచుకున్నారు. "ఈ 15,000 మరణాలకు ట్రంపే బాధ్యుడు. ఆయన పోస్టులు చూసే చాలామంది రోడ్లపైకి వచ్చారు" అని టెహ్రాన్‌కు చెందిన ఓ వ్యాపారవేత్త అన్నారు. "ట్రంప్ మమ్మల్ని యుద్ధంలో బలిపశువులుగా వాడుకున్నారు. మా కాళ్ల కింద నుంచి నేల లాగేశారు" అని మరికొందరు ఆరోపించారు.

వాస్తవానికి, దేశంలో కరెన్సీ విలువ పడిపోవడం, ధరల పెరుగుదల వంటి ఆర్థిక సమస్యలతో ఈ నిరసనలు మొదలయ్యాయి. అయితే, ఇవి క్రమంగా ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలుగా మారాయి. ఇరాన్ అధికారులు మాత్రం ఈ నిరసనలను అమెరికా కుట్రగా అభివర్ణిస్తున్నారు. ట్రంప్ తీరుతో ఇరాన్ ప్రజల్లో ఆయనపై తీవ్ర అపనమ్మకం నెలకొంది.

## ఆరుగురు మావోయిస్టులు మృతి

- మొదటి పేజి తరువాయి

బ్యూరో ఇన్‌ఛార్జి సున్నం చంద్రయ్య ఎలియాస్ పాపారావు.. నేషనల్ పార్క్ ఏరియా కమిటీ చీఫ్ దిలీప్ బెడ్జా ఉన్నారని నిఘావర్గాలకు సమాచారం అందడంతో బలగాలు ఆపరేషన్ చేపట్టాయి. శనివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో నేషనల్ పార్క్ ఏరియా కమిటీ చీఫ్ దిలీప్ బెడ్జా సహా నలుగురు మావోయిస్టులు మృతి చెందినట్లు బీజాపూర్ ఎస్పీ జితేంద్రకుమార్ తెలిపారు. ఓ మహిళా మావోయిస్టు సహా నలుగురి మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. మృతుల్లో దిలీప్ బెడ్జా ఉన్నట్లు గుర్తించారు. అదే ప్రాంతంలో ఇవాళ జరిగిన ఎదురుకాల్పుల్లో మరో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. ఘటనా స్థలం నుంచి ఏకే 47, 303 రైఫిల్, ఇన్సాస్, రైఫిల్‌తో పాటు భారీగా పేలుడు పదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

# తెలుగు జాతి కీర్తి పతాక నందమూరి తారక రామారావు

**- మంత్రి ఆనం రామనారాయణరెడ్డి**

**- ఎమ్మెల్యే దామచర్ల నేతృత్వంలో ఘనంగా ఎన్టీఆర్ 30 వర్ధంతి వేడుకలు**

**- పాల్గొన్న మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి, ఎంపీ మాగుంట,ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర**









**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ జనవరి 18**

సమాజమే దేవాలయం పేద ప్రజలే దేవుళ్ళు అనే ఆశయంతో స్వర్గీయ నందమూరి తారక రామారావు స్థాపించిన తెలుగుదేశం పార్టీ నేటికీ అదే స్ఫూర్తితో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో ముందుకు పోతుందని ప్రకాశం జిల్లా ఇన్చార్జి మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. ఒంగోలు శాసనసభ్యులు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల జనార్దన్ రావు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు 30వ వర్ధంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముందుగా గుంటూరు రోడ్డులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు ప్రారంభించారు. అనంతరం అద్దంకి బస్టాండ్ వద్ద ఆధునీకరించిన ఎన్టీఆర్ విగ్రహాన్ని రాష్ట్ర మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి ప్రారంభించారు. ఎన్టీఆర్ వర్ధంతి సభలో మంత్రులు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తెలుగు జాతి పౌరుషానికి ప్రతీక అని పేర్కొన్నారు. తెలుగుజాతి ఔన్నత్యాన్ని చాటేందుకు, తెలుగు ప్రజల సంక్షేమం కోసం నాటి కాంగ్రెస్ పార్టీ పెత్తందారు వ్యవస్థను కూకటివేళ్లతో పెకలించి, మద్రాసి భావన నుండి తెలుగు ప్రజలకు ఒక గౌరవాన్ని గుర్తింపుని తెచ్చిన మహనీయుడు నందమూరి తారక రామారావు అని కొనియాడారు. చెన్నై మహానగరానికి తెలుగు గంగను తీసుకుని వెళ్లి తమిళ ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానాన్ని ఎన్టీఆర్ సంపాదించుకున్నారని అన్నారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ అధారిటీ ద్వారా ఓపెన్ ఛానల్ ద్వారానే తెలుగు గంగ ద్వారా చెన్నైకు నీరు అందించాలని ఎన్టీఆర్ సంకల్పించడం ద్వారానే రాయలసీమలోని పలు ప్రాంతాలకు తెలుగు గంగా జలాలు అందాయని గుర్తు చేశారు. ఎన్టీఆర్ ద్వారానే ఎంతో మంది యువత నాడు రాజకీయం ప్రవేశం చేసి ఉన్నత స్థానాలకు ఎదిగారని మంత్రులు గుర్తు చేశారు. సభాధ్యక్షులు ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తోటే పేదల సంక్షేమం ప్రారంభమైందని అన్నారు . ప్రతి పేదవాడికి కూడు, గూడు, గుడ్డ అందించి ఆదుకున్న ఘనత స్వర్గీయ నందమూరి తారక రామారావుకి దక్కుతుందన్నారు. ఆయన స్ఫూర్తితో సూపర్ సిక్స్ పథకాల ద్వారా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేదల సంక్షేమాన్ని కొనసాగిస్తున్నారని ఎమ్మెల్యే దామచర్ల కొనియాడారు. సభలో ఒంగోలు పార్లమెంట్ సభ్యులు బాగుంట శ్రీనివాసులురెడ్డి, ప్రకాశం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, కనిగిరి శాసనసభ్యులు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి తమ సందేశాన్ని అందించారు. రక్తదాన శిబిరంలో 140 మంది రక్తదానం చేశారు. వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో దాదాపు 15 వేల మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, నందమూరి అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

పెన్ పవర్
MARKAPURAM మార్కాపురం
మార్కాపురం - ప్రకాశం

# వైసీపీ హయాంలో రక్తపాతం.. కూటమి పాలనలో సాగునీటి జలపాతం

**వ్యక్తుల గొడవలకు రాజకీయ రంగు పులిమితే ఊరుకోం**

**కుట్ర రాజకీయాల వల్లే ప్రజలు మిమ్మల్ని 11 సీట్లకే పరిమితం చేశారు**

**పల్నాడు ప్రశాంతతకు భంగం కలిగించే వారిని ఉపేక్షించేది లేదు**

**మంత్రి గొట్టిపాటి రవికుమార్ హెచ్చరిక**



**అద్దంకి ఆర్సి ఇన్చార్జి, పెన్ పవర్, జనవరి 18:**

పల్నాడు గడ్డపై గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రక్తం ఏరులై పారితే.. నేడు చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వ హయాంలో పంట భూములకు నీళ్లు పారుతున్నాయని, అద్దంకి ఎమ్మెల్యే, పల్నాడు జిల్లా ఇంచార్జ్ మంత్రి, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి. రవికుమార్ స్పష్టం చేశారు. పల్నాడులో ఇటీవల ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన ఘర్షణకు రాజకీయ రంగు పులిమి, ప్రభుత్వంపై బురద చల్లడానికి వైసీపీ నేతలు కుట్రలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఆదివారం క్యాంపు కార్యాలయం నుంచి విడుదల చేసిన వీడియోలో ఆయన వైసీపీ తీరును తీవ్రంగా ఎండగట్టారు.

**అరాచకాలకు కేరాఫ్ వైసీపీ**

చంద్రబాబు పాలనకు, జగన్ పాలనకు ఉన్న తేడా ప్రజలకు స్పష్టంగా తెలుసని మంత్రి అన్నారు. గత ఐదేళ్లలో పల్నాడు ప్రాంతం ఫ్యాక్షన్, అక్రమ మైనింగ్‌తో వల్లకాడుగా మారిందని విమర్శించారు. గురజాల నియోజకవర్గం, మాచవరం మండలం పిన్నెల్లి గ్రామంలో వైసీపీ అరాచకాలకు భయపడి సుమారు 300 మంది ఊరు విడిచి పారిపోయారని గుర్తు చేశారు. జగన్ పాలనలో ఒక్క పిన్నెల్లిలోనే 12 మందిని చంపేశారని, అందులో ఎస్సీ, బీసీలు కూడా ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమ మైనింగ్ గుంతల్లో పడి ప్రాణాలు కోల్పోయిన వారిని కూడా గత ప్రభుత్వం పట్టించుకోలేదని ధ్వజమెత్తారు.

**అభివృద్ధే లక్ష్యం.. శాంతిభద్రతలే ధ్యేయం**

కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక, గతంలో ఊరు విడిచి వెళ్లిన బాధితులంతా తిరిగి స్వగ్రామాలకు వస్తున్నారని మంత్రి తెలిపారు. పల్నాడు రైతుల భూములకు సాగునీరు అందిస్తూ, గ్రామాభివృద్ధే లక్ష్యంగా చంద్రబాబు పని చేస్తున్నారని చెప్పారు. కానీ, వైసీపీ నేతలు మాత్రం గ్రామాల్లో జరిగే హత్యలకు రాజకీయ రంగు పూసి లబ్ధి పొందాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కుట్రపూరిత రాజకీయాలకు పాల్పడుతున్నందుకే ప్రజలు ఆ పార్టీని 11 సీట్లకే పరిమితం చేశారని, అయినా వారి తీరు మారలేదని ఎద్దేవా చేశారు.

**కఠిన చర్యలు తప్పవు**

రాష్ట్రంలో ఎక్కడ హత్యా రాజకీయాలు జరిగినా, ఫ్యాక్షన్ గొడవలు తలెత్తినా కూటమి ప్రభుత్వం ఉపేక్షించదని మంత్రి హెచ్చరించారు. పల్నాడు ప్రశాంతతను భగ్నం చేయాలని చూస్తే చూస్తూ ఊరుకోబోమని స్పష్టం చేశారు. బాధితులకు అండగా ఉంటూనే, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై పోలీస్ శాఖ ద్వారా కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి గొట్టిపాటి తేల్చిచెప్పారు.

# కందుకూరులో టిడిపిని తిరుగులేని శక్తిగా మారుస్తా

**-ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు**

**-ఘనంగా ఎన్టీఆర్ 30వ వర్ధంతి**

**-నివాళులర్పించిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, దివి శివరాం, పార్టీ నేతలు**

**-వేలాదిగా తరలివచ్చిన తెలుగు తమ్ముళ్లు, అభిమానులు**





**కందుకూరు పెన్ పవర్, జనవరి 18**

అందరి సహకారంతో కందుకూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీని తిరుగులేని శక్తిగా మారుస్తానని స్థానిక శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారక రామారావు 30 వర్ధంతిని కందుకూరు పట్టణంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పార్టీ నేతలతో కలిసి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి ర్యాలీగా వెంగమాంబ కళ్యాణ మండపం చేరుకొని, ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాజీ ఎమ్మెల్యే శివరాం కలిసి ప్రారంభించారు. అనంతరం వర్ధంతి సభ జరిగింది. పట్టణంతోపాటు అన్ని మండలాల నుంచి వేల సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఎన్టీఆర్ అభిమానులు తరలివచ్చి అన్నగారిని స్మరించుకుంటూ జోహార్ ఎన్టీఆర్ అంటూ నినాదాలు చేశారు. పట్టణ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే దివి శివరాం సహా నేత పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ ఏడాదిలో మరణించిన పార్టీ నేతలు కార్యకర్తలకు సంతాపం తెలిపారు. తరువాత సర్వమత ప్రార్థనలు జరిగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ తెలుగు ప్రజల గౌరవాన్ని నిలబెట్టి, వారి గుండెల్లో శాశ్వత ముద్ర వేసుకున్న ఒకే ఒక నాయకుడు నందమూరి తారక రామారావు అన్నారు. ఆయన అమలు చేసిన పథకాలన్నీ పేదలు, బడుగు బలహీనవర్గాల ప్రజలకు ఎంతగానో ఉపయోగపడ్డాయని చెప్పారు. మండల కార్యాలయాలు, బస్ స్టేషన్ల నిర్మాణం, మహిళలకు ఆస్తిలో వాటా, రెండు రూపాయలకు కిలో బియ్యం లాంటి కార్యక్రమాలకు బీజం వేసింది ఎన్టీఆర్ అన్నారు. వృద్ధుల కోసం 30 రూపాయలతో పెన్షన్ పథకాన్ని ఎన్టీఆర్ ప్రారంభిస్తే, చంద్రబాబు నాయుడు గారు నేడు దాన్ని 4 వేలకు తీసుకువెళ్లారని ఎమ్మెల్యే చెప్పారు. ఎన్టీఆర్ ఆశలు, ఆశయాలను చంద్రబాబు నాయుడు కొనసాగిస్తున్నారని తెలిపారు. నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ ఎప్పటికీ బలంగా ఉండేలా కృషి చేస్తున్నానని, గత ఎన్నికల్లో తన వెంట నడిచిన ప్రతి కార్యకర్తను కాపాడుకుంటానని ఎమ్మెల్యే నాగేశ్వరరావు స్పష్టం చేశారు. నియోజకవర్గ అభివృద్ధి కళ్ళముందు కనిపిస్తోందని, రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు పెద్ద ఎత్తున జరగబోతున్నాయని ఎమ్మెల్యే వెల్లడించారు. వర్ధంతి కార్యక్రమాన్ని జయప్రదం చేసిన ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దివి శివరాం మాట్లాడుతూ ఎన్టీఆర్ మహోన్నత వ్యక్తి అని, తెలుగు ప్రజలు ఆయన ఎప్పటికీ మరిచిపోరని అన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తల పింఛన్లను తొలగించారని, వారందరికీ న్యాయం జరిగేలా చొరవ తీసుకోవాలని ఎమ్మెల్యే నాగేశ్వరరావును కోరారు. 2029 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా మళ్లీ నాగేశ్వరరావు గెలవడం ఖాయమన్నారు.ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకొని టిడిపి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో వేలాదిమందికి అన్నదానం నిర్వహించారు.







ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, రాచగర్ల సుబ్బారావు పూరిమెట్ల గురునాథం, జనిగర్ల నాగరాజు, మాదాల లక్ష్మీనరసింహం, ఒంగోలు డైరీ మాజీ చైర్మన్ చల్లా శ్రీనివాసరావు, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చిలకపాటి మధుబాబు, ఎన్టీఆర్ విగ్రహ కమిటీ అధ్యక్షులు పిడికిటి వెంకటేశ్వర్లు, ఉప్పుటూరి శ్రీనివాసరావు, నార్నె రోశయ్య, గొర్రెపాటి శ్రీనివాసరావు, అల్లం వెంకటేశ్వర్లు, ఉన్నం వీరాస్వామి, సోమినేని రవీంద్ర, గల్లా శ్రీనివాసరావు, చదలవాడ కొండయ్య, షేక్ రూబీ, రావూరి రామకోటయ్య, తానికొండ శ్రీను, మర్రిపూడి శ్రీనివాసరావు,షేక్ రఫీ, బెజవాడ ప్రసాద్, చుండూరి శ్రీను,గొట్టిపాటి హరికృష్ణ, తోకల వెంకటేశ్వర్లు, మంచిరాజు మురళీమోహన్, రాధాకృష్ణమాచార్యులు, ముచ్చు శ్రీను, ముచ్చు వేణు, మేడా మల్లికార్జున, గొర్రెపాటి సాంబయ్య, షేక్ మున్న, పేపర్తి హరికృష్ణ, కూనం నరేంద్ర, కల్లూరి శైలజ, పువ్వాడి మౌనిక, పొడపాటి మహేష్, మోదడుగు వెంకటేశ్వర్లు, రెబ్బవరపు మాల్యాద్రి, పల్లపోతు వెంగళరావు, షేక్ మున్నా, పొన్నగంటి వెంకటరావు, లక్ష్మీ రాజ్యం, దూదిపల్లి అఖిల నియోజకవర్గంలోని పార్టీ సీనియర్ నేతలు, కార్యకర్తలు ఎన్టీఆర్ అభిమానులు, మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## వైద్యశాలకు రైల్వేస్టేషన్‌కు వీల్ చైర్లు బహుకరించిన పిడతల ప్రవీణ్ కుమార్ రెడ్డి






**గిద్దలూరు పెన్ పవర్ జనవరి 18**

ఏపీ వైసీపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ గిద్దలూరు వైసిపి నాయకులు పిడతల ప్రవీణ్ కుమార్ రెడ్డి దాతృత్వం చాటుకున్నారు. గిద్దలూరు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి కి రైల్వేస్టేషన్ కి వికలాంగులకు రోగుల కొరకు వీల్ చైర్లు బహుకరించారు. అత్యవసర సమయంలో సీనియర్ సిటిజన్సలకు,వికలాంగులకు రోగులకు లేదా ఏదైనా ప్రమాద బారిన పడిన వారికి ఈ వీల్ చైర్లు ఎంతో ఉపయోగపడతాయని వీల్ చైర్స్ గ్రహీతలు అన్నారు. వీల్ చైర్లు బహుకరించిన ప్రవీణ్ కుమార్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైల్వే సిబ్బంది లక్ష్మీ నారాయణ,గోటికే రవీంద్రారెడ్డి, ముడియం వెంకట్రామిరెడ్డి, గోటికే ప్రసాద్ రెడ్డి, వెంకట్ రెడ్డి,వేమారెడ్డి ఎం.భాస్కర్ రెడ్డి పలువురు నాయకులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ గారి వర్ధంతి సందర్భంగా.. "లెజెండరీ బ్లడ్ డొనేషన్ డ్రైవ్‌లో బీజేపీ నాయకులు



**గిద్దలూరు పెన్ పవర్ జనవరి 18**

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, నందమూరి తారకరామారావు వర్ధంతి సందర్బంగా, గిద్దలూరు శాసనసభ్యులు, ఏపీ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని విట్టా సుబ్బరత్నం కళ్యాణ మండపంలో ఉదయం 8.00 గంటలకు ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలు, లెజండరీ బ్లడ్ డొనేషన్ డ్రైవ్ (మహా రక్తదానం) కార్యక్రమంలో గిద్దలూరు శాసనసభ్యుని సోదరులు ముత్తుముల కృష్ణ కిషోర్ రెడ్డి తో కలసి భారతీయ జనతా పార్టీ తరుపున గిద్దలూరు బిజెపి నాయకులు అప్పిశెట్టి ఉదయ్ శంకర్, మాజీ జిల్లా ఉపాధ్యక్షులు భవ నాసి వెంకట రామాంజనేయులు, సీనియర్ నాయకులు పిడతల రమేష్ రెడ్డి, లు పాల్గొనగా అప్పిశెట్టి ఉదయ్ శంకర్ బ్లడ్ డొనేట్ చేసి యువత రక్తదానం చేసి ప్రాణాదాతలు కావాలని కోరారు. ఈ కార్యక్రమం లో ఎన్ డి యే కూటమి పార్టీ లు టి డి పి, జెనసేన, బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## క్రికెట్ టోర్నమెంట్ విజేత కే అగ్రహారం



**పొన్నలూరు పెన్ పవర్ జనవరి 18**

మండలంలోని కే అగ్రహారం గ్రామంలో సంక్రాంతి పండగను పురస్కరించుకొని చౌతన్ లీడర్స్ ప్రవేట్ లిమిటెడ్ కంపెనీ పే వాలెట్, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో గత వారం రోజులుగా నిర్వహించిన సి టి పి ఎల్ జి క్రికెట్ టోర్నమెంట్ విజేతగా కె అగ్రహారం ఇమ్ము లేవన్ జట్టు నిలిచింది. విజేతగా నిలిచిన జట్టుకు రూ50116, రన్నర్స్ కు రూ 25116 నగదు తో పాటు ట్రోఫీ నీ చౌతన్ ట్రేడర్స్ కంపెనీ చైర్మన్ మామిడి ప్రదీప్ చేతుల మీదగా అందజేశారు. అనంతరం 40 వేల రూపాయలు విలువ గల క్రికెట్ కిట్టులు అందజేశారు.ఈ కార్యక్రమంలో పిల్లి తిరుపతిరెడ్డి, పల్నాటి వెంకటేశ్వర రెడ్డి, సర్పంచ్ ఎస్.కె చిన్న మస్తాన్, పిల్లి చక్రవర్తి రెడ్డి, వి ప్రసాద్ క్రీడాకారులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్‌కు టీడీపీలోని రెండు వర్గాల జోహారులు

### తెలుగు వారి ఆత్మ గౌరవం ఎన్టీఆర్.. మన్నే రవీంద్ర

### పేదల పెన్నిధి అన్న నందమూరి.. గూడూరి ఎరీక్షన్ బాబు

**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ జనవరి 18**

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం జరిగిన, ఎన్టీఆర్ జయంతులు, వర్ధంతులు నిర్వహించిన యర్రగొండపాలెంలో తెలుగుదేశం పార్టీలోని రెండు గ్రూపులు వేరు వేరుగానే కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతూనేవుంది. ఎన్నికల అనంతరం నుండి నియోజకవర్గం లో రగులుకున్న వర్గ కుంపటి వారి వారి అనుయాయులతో కొనసాగడం తెలిసిందే. ఆదివారం ఎన్టీఆర్ 30వ జయంతి సందర్బంగా జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్, ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ కార్పొరేషన్ మాజీ వైస్ చైర్మన్ ప్రముఖ వైద్యులు మన్నే రవీంద్ర ఆయన అనుచరవర్గంతో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు, ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ సినీ రంగంలో క్రిష్ణుడిగా, రాముడిగా,నటించి ప్రజల మనస్సులో దేవుడిగా నిలిచాడని, రాజకీయ రంగంలో సంక్షేమ పథకాలు అమలు చేసి తెలుగువారి ఆత్మ గౌరవాన్ని ఎలుగెత్తి చాటిన మహానుభావుడని అన్నారు.ఎన్టీఆర్ ఆశయాలను అమలు చేసి తెలుగుదేశం పార్టీ బలోపేతానికి నారా చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలోమాజీ మార్కెట్ యార్డు చైర్మన్ చేకూరి ఆంజేనేయులు, మాజీ మండల పార్టీ అధ్యక్షులు ముస్లీమ్ మైనారిటీ నాయకులు షేక్ జీలాని, మాజీ మండల అధ్యక్షులు వడ్లముడి లింగయ్య, పెద్దారవీడు మాజీ మండల అధ్యక్షులు వెన్న వెంకటరెడ్డి, మురారిపల్లి నాయకులు పోతిరెడ్డి రమణారెడ్డి, మేకల బాధరయ్య తదితరులు పాల్గొన్నారు. టీడీపీ నియోజకవర్గ ఇంచార్జి గూడూరి ఎరీక్షన్ బాబు మండల, పట్టణ పార్టీ నాయకులతో ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు, అనంతరం ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి వారి రాజకీయ రంగ అభివృద్ధికి ఎన్టీఆర్ పాటుపడ్డాడని, రెండు రూపాయలకే బియ్యం, సామాజిక పెన్షన్లు,పక్కగృహాలు అందించి పేదల పెన్నిధిగా నిలిచిపోయాడని అన్నారు. నేడు నందమూరి తారకరామారావు స్ఫూర్తితో ముఖ్యమంత్రి



నారా చంద్రబాబునాయుడు రాష్ట్రంలో సంక్షేమ పాలన అందిస్తున్నారని అన్నారు.గత ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని మరచిందని అవినీతికి పాల్పడి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందన్నారు. ఎన్టీఆర్ ఆశయాలు రాష్ట్రంలో అమలు చేస్తున్నా చంద్రన్నకు అండగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు చిట్యాల వెంగళరెడ్డి, పట్టణ



అధ్యక్షులు పెరుమాళ్ళ మల్లికార్జున, నాయకులు చేకూరి సుబ్బారావు, రాష్ట్ర నాయకులు నలగాటిమల్లికార్జున నాయుడు, వేగినాటి శ్రీనివాస్, తోట మహేష్ నాయుడు, కొత్తమాసు సుబ్రహ్మణ్యం,కందుల నారాయణ రెడ్డి, షేక్ మస్తాన్ వలి, షేక్ ఇస్మాయిల్,తదితరులు పాల్గొన్నారు. అనంతరం రోగులకు పండ్లు పంపిణి చేసారు.

## యుగ పురుషుడు ఎన్టీఆర్‌కీ ఘన నివాళ్ళు...

### టీడీపీ మండల కన్వీనర్ పోట్ల గోవింద్....



**పుల్లల చెరువు పెన్ పవర్ జనవరి 18**

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, యావత్ తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహానాయకుడు నందమూరి తారక రామారావు 30వ వర్ధంతిని పుల్లల చెరువు మండల కేంద్రంలో టీడీపీ మండల కన్వీనర్ పోట్ల గోవింద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా టిడిపి మండల కన్వీనర్ పోట్ల గోవింద్ మాట్లాడుతూ తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన యుగ పురుషుడు ఎన్టీఆర్ అని కొనియాడారు.యావత్ తెలుగు ప్రజలు అన్నగారు అని ప్రేమగా పిలిచే ఎన్టీఆర్ 1996 జనవరి 18న మన మధ్య నుంచి భౌతికంగా దూరమైనా, ఆయన ఆశయాలు, ఆయన ఆలోచనలు నేటికీ తెలుగు ప్రజల హృదయాల్లో సజీవంగానే ఉన్నాయి అని అన్నారు.తెలుగు భాష, సంస్కృతి, సంప్రదాయాలకు ప్రపంచ వేదికపై గౌరవం తీసుకొచ్చిన నాయకుడు ఎన్టీఆర్ అని అన్నారు. రాజకీయాల్లోకి రావడానికి ముందు సినీ రంగంలో తారక రాముడు పోషించిన పౌరాణిక పాత్రలు కోట్లాది మందిని ప్రభావితం చేశాయని తెలిపారు. ఇళ్లలో దేవుళ్ల పక్కనే ఎన్టీఆర్ చిత్రాలను ఉంచి ప్రజలు పూజించడం ఆయనకే దక్కిన అరుదైన గౌరవం అని అన్నారు.రాజకీయాల్లోకి వచ్చి కేవలం తొమ్మిది నెలల్లోనే అధికారాన్ని సాధించి, తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి నూతన దిశానిర్దేశం చేసిన నాయకుడు ఎన్టీఆర్ అని తెలిపారు. పేదలకు సంక్షేమ పథకాలు, మహిళలకు ఆర్థిక భరోసా, గ్రామ స్వయంప్రతిపత్తి వంటి ఎన్నో సంస్కరణలకు నాంది పలికిన మహానాయకుడిగా ఆయన నిలిచారని



అన్నారు.అనంతరం టీడీపీ మాజీ మండల కన్వీనర్ పయ్యావుల ప్రసాద్ మాట్లాడుతూ స్వర్గీయ ఎన్టీఆర్ తీసుకున్న సాహసోపేతమైన నిర్ణయాలు పాలనలో విప్లవాత్మక మార్పులకు నాంది పలికాయని పయ్యావుల ప్రసాద్ స్పష్టం చేశారు. అధికారం శాశ్వతం కాదు, దానిని సద్వినియోగం చేసుకొని ప్రజలకు మేలు జరగాలని ఎన్టీఆర్ ఆకాంక్షించారు. ఆయన స్థాపించిన టీడీపీలో తాను పార్టీకి సేవలందించడం గర్వంగా ఉందన్నారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో పని చేస్తూ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు నిరంతరం కృషి చేస్తామని ఆయన అన్నారు.తెలుగు జాతిని ప్రపంచ పటంలో నిలబెట్టిన కథానాయకుడు, మహానాయకుడు నందమూరి తారక రామారావు అని అన్నారు.ఎన్టీఆర్ ఆశయాలు ప్రతి తెలుగు వాడి జీవితానికి మార్గదర్శకమని, ఆయన వర్ధంతి సందర్భంగా గ్రామ గ్రామాల్లో తెలుగు ప్రజలు ఘనంగా నివాళులు అర్పిస్తున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ కందుల వెంకటయ్య, రాష్ట్ర రైతు సంఘం నాయకులు కాకర్ల కోటయ్య, రెంటపల్లి సుబ్బారెడ్డి, మాజీ ఏఎంసి డైరెక్టర్ ఉప్పల హనుమంత్,గజ్జవల్లి భాస్కర్, ఎంపీటీసీ పెద్దింటి వెంగయ్య, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కేశనపల్లి బక్కయ్య,టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ చట్టం రద్దుపై గోడ పత్రిక ఆవిష్కరణ



**పెన్ పవర్, పామూరు, జనవరి 18**

మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పీక నొక్కుతూ మోడీ ప్రభుత్వం చేస్తున్న వి బి జి రామ్ జి బిల్లును వ్యతిరేకించాలని కోరుతూ ఆదివారశీ సిపిఎం జిల్లా సెక్రటరీ సభ్యులు సయ్యద్ హానీఫ్ పప్పు వెంకోబ్ రావు మీటింగ్ హాల్లో గోడ పత్రిక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా సెక్రటరీ సభ్యులు సయ్యద్ హానీఫ్ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం వి బి జి రాంజీ బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు పరుస్తున్న ప్రజలకు వ్యతిరేకమైన చట్టాలను రాష్ట్రములో కూటమి ప్రభుత్వం అమలు చేరటం సిగ్గుచేటు అన్నారు. ఉపాధి పథకం వ్యక్తి వేసి పేదల పొట్ట కొట్టేందుకు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. సిపిఎం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మండలంలోని ప్రతి గ్రామంలో కరపత్రాలు పంపిణీ చేసి జాతీయ ఉపాధి హామీ పథకం యొక్క విషయాన్ని ఉపాధి కూలీలకు తెలియజేస్తామని అన్నారు. పేద ప్రజలకు అన్యాయం చేస్తే కూటమి ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. గోడ పత్రిక ఆవిష్కరణ కార్యక్రమంలో కే మాల్యాద్రి, షేక్ ఖాదర్ భాషా, కే శంకర్, చల్లా వెంకటేశ్వర్లు, యాట వీరనారాయణ, నాగి వెంకటేష్, సుభాని, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలు



**పొన్నలూరు పెన్ పవర్ జనవరి 18**

మండల కేంద్రమైన పొన్నలూరులో ఆదివారం నందమూరి తారక రామారావు 30వ వర్ధంతి వేడుకలు మండల టిడిపి అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎన్టీఆర్ ,దామచర్ల ఆంజనేయులు, మండవ పుల్లయ్య విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ ఎన్టీఆర్ అనేది ఒక పేరు కాదు ప్రభంజనం అదొక సంచలనం తెలుగువాడి విశ్వరూపం వెండితెరపై రారాజుగా వెలుగొందారని రాజకీయాల్లో మహానాయకుడిగా రాణించారని, తెలుగుజాతి ఆత్మగౌరవం సామాజిక న్యాయం ,ప్రజా సంక్షేమం అనే సిద్ధాంతాలపై తెలుగుదేశం పార్టీని నిర్మితమైందని సమాజమే దేవాలయం ,ప్రజలే దేవుళ్ళని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొండ్రగుంట శ్రీనివాసరావు, మాజీ మండల టిడిపి అధ్యక్షుడు మండవ ప్రసాద్, మాజీ సర్పంచ్ పల్లపోతు ప్రసాద్, గుమ్మల్ల వెంకట్రావు, సన్నమూరి నరసింహ, మధుబాబు, రమణయ్య, పిల్లి వెంకట్ నారాయణ, నరేంద్ర, మన్నెం మల్లికార్జునరావు, ఉన్నం శ్రీనివాసరావు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకునేందుకై ఉద్యమించాలి

### సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కె.మాల్యాద్రి పిలుపు



**పెన్ పవర్, పామూరు జనవరి 18**


మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి చట్టాన్ని కాపాడుకునేందుకు ఉద్యమాలు చేపట్టాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొమ్మలపాటి మాల్యాద్రి అన్నారు. ఆదివారం పట్టణంలోని డివి పాలెం, కరెంట్ ఆఫీస్ కాలనీ, చెన్నకేశవ నగర్ లలో ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేస్తూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం వి. బి. జి. రాంజీ పదకంగా పేరు మార్చి చట్టం స్ఫూర్తిని దెబ్బతిస్తుందని ఆయన అన్నారు. పాత చట్టం వల్ల గ్రామీణ కూలీలకు ఆర్థిక సాంఘిక చట్టం ఎంతగానో తోడ్పడింది. కేంద్ర ప్రభుత్వం 60 శాతం రాష్ట్రాలకు 40 శాతం భారాన్ని మోపింది ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర అసెంబ్లీలు తీర్మానం చేయాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు వామపక్ష పార్టీలు వ్యవసాయ కార్మిక సంఘాలు గత పది సంవత్సరాలుగా బడ్జెట్లో రెండు లక్షల కోట్లు కేటాయించాలని రోజు వేతనం 600రూ. ఇవ్వాలని, రెండు వందల రోజులు పని దినాలు కల్పించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కె.మాల్యాద్రి అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కమిటీ వైవీ నారాయణ పి శ్రీను, ఈ. సుజాత, కాతున్ని, లక్ష్మి,, బిబి, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయిన స్వర్గీయ ఎన్టీ రామారావు

**ముఖ్యమంత్రిగా, ఆదర్శ పాలకునిగా, వెండితెర కథానాయకుడిగా పేరు ప్రఖ్యాతలు గడించిన ఎన్టీ రామారావు.**

**స్వర్గీయ ఎన్టీ రామారావు వర్ధంతిని పురస్కరించుకొని నివాళులర్పించిన షేక్ హసీనా.**





**కొమరోలు పెన్ పవర్ జనవరి 18**

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఆదర్శ పాలకులు, వెండితెర కథానాయకులుగా పేరు ప్రఖ్యాతులు గడించి ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయిన స్వర్గీయ ఎన్టీ రామారావు నేటి పాలకులకు , తనకు ఆదర్శప్రాయులని గిద్దలూరు మార్కెట్ యార్డ్ డైరెక్టర్, గిద్దలూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ మహిళా నాయకురాలు షేక్ హసీనా పేర్కొన్నారు. స్వర్గీయ ఎన్టీ రామారావు 30వ వర్ధంతిని పురస్కరించుకొని షేక్ హసీనా ఆదివారం హనుమంతురాయుని పల్లెలోని తన నివాస గృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎన్టీ రామారావు చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. ఆ సందర్భంగా హసీనా మాట్లాడుతూ స్వర్గీయ ఎన్టీ రామారావు విశ్వవిఖ్యాత నటసార్వభౌముడిగా ,వెండి తెరను ఏలిన కథానాయకుడుగానే కాకుండా, ప్రజలు మెచ్చిన ముఖ్యమంత్రిగా ,పేదల సంక్షేమం కోసం కృషి చేసిన మహా నాయకుడిగా చరిత్ర పుటల్లో చెరగని స్థానం సంపాదించుకున్నారని ఆమె పేర్కొన్నారు. ప్రభుత్వమంటే భయపడే యంత్రం కాదని, ప్రజలకు అండగా నిలబడే వ్యవస్థ అన్న భావన నింపిన గొప్ప నాయకుడు మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్టీ రామారావు అని నివాళులర్పించారు. ఎన్టీ రామారావు ముఖ్యమంత్రిగా పని చేసిన కాలంలో పేదలు, నిరుపేదలు, బడుగు బలహీన వర్గాలతో పాటు అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం ప్రవేశపెట్టి అమలు చేసిన సంక్షేమ పథకాలు చిరస్మరణీయమని, నేటి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఆనాటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు ప్రవేశపెట్టి అమలు చేసిన సంక్షేమ పథకాలను సమర్థవంతంగా కొనసాగిస్తూ ప్రజలకు స్వచ్ఛమైన పాలన అందిస్తూ ఎన్టీ రామారావు ఆదర్శాలను అమలు చేస్తూ ఆయన చూపిన బాటలో నడుస్తూ మరో ఆదర్శ ముఖ్యమంత్రిగా పేరు ప్రఖ్యాతులు గడిస్తున్నారని ఆమె పేర్కొన్నారు. అలాగే గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి నాటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు ,నేటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదర్శాలను పునికి పుచ్చుకొని గిద్దలూరు నియోజకవర్గ అభివృద్ధికి , ప్రజా సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తూ ముందుకు సాగుతున్నారని ఆమె తెలిపారు. తనకు చిన్నతనం నుంచి ఎన్టీ రామారావు అంటే ఎనలేని అభిమానం, గౌరవమని, ఆయన ఆదర్శలను స్ఫూర్తిగా తీసుకున్న తాను తెలుగుదేశం పార్టీలో చేరి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్నానని తెలిపారు, తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి తాను చేస్తున్న సేవలను గుర్తించిన గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి ఆశీస్సులతో గిద్దలూరు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ బాధ్యతలు స్వీకరించే అవకాశం, అదృష్టం తనకు కలగటం తనకు జీవితంలో కలిగిన గొప్ప గౌరవంగా భావిస్తున్నానని హసీనా పేర్కొన్నారు. ఆ కార్యక్రమంలో హసీనా కుటుంబ సభ్యులు, హనుమంతరాయుని పల్లె,తదితర గ్రామాల నుంచి వచ్చిన తెలుగుదేశం పార్టీ నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

# పొదిలిలో లాడ్జిలను తనిఖీ చేసిన పోలీసులు



**పొదిలి, పెన్ పవర్ జనవరి 18**

పొదిలిలో లాడ్జిలను పోలీసులు తనిఖీలు జరిపారు. పట్టణంలోని లాడ్జిలపై పలు ఆరోపణలు వెల్లువెత్తుతున్న దృష్ట్యా ఆదివారం నాడు పోలీసులు పలు లాడ్జిలను క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కొన్ని లాడ్జిల్లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు గుర్తించడంతోపాటు పలువురిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. లాడ్జిల్లో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని నిర్వాహకులను హెచ్చరించిన పోలీసులు.

# నివాళులు అర్పించిన ఎమ్మెల్యే ముత్తుముల



**గిద్దలూరు పెన్ పవర్ జనవరి 18**

గిద్దలూరు పట్టణంలోనీ ప్రశాంతి నగర్ లో నివాసముంటున్న రిటైడ్ రిటైడ్ఇంజనీర్ఈదుల రంగారెడ్డి అనారోగ్యంతో మరణించిన విషయం తెలుసుకున్న “ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి” ఆయన నివాసానికి వెళ్లి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు కుటుంబానికి మనోధైర్యం తెలిపారు ఎమ్మెల్యే తో పాటు మాజీ సర్పంచ్ దప్పిలి భాస్కర్ రెడ్డి , అంబవరం శ్రీనివాస్ రెడ్డి , గోపాల్ రెడ్డి , మల్లిఖార్జున , తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.

# ఆధ్యాత్మిక మార్గం అందరికీ ఆదర్శనీయం

**ఎమ్మెల్యే నారాయణరెడ్డి స్పష్టం**





**పొదిలి, పెన్ పవర్, జనవరి 18**

ఆధ్యాత్మిక మార్గం అందరికీ ఆదర్శనీయమని మార్కాపురం నియోజకవర్గ శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి చెప్పారు. ఆదివారం నాడు పొదిలి పట్టణంలో కుసుమ హరనాథ్ 81వ ఆనంద మేళోత్సవాల వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నారాయణరెడ్డి మాట్లాడుతూ ఆధ్యాత్మిక మార్గంలోనే మానసిక ప్రశాంతత ఉంటుందన్నారు. సమాజంలో ఇతరులకు ముఖ్యంగా పేద వర్గాలకు ఎంతో కొంత సాయం చేయడంలోనే సంతృప్తి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యదర్శి గునుపూడి భాస్కర్ దంపతులతోపాటు కుసుమ హరినాథ్ భక్తమండలి నిర్వాహకులు గునుపూడి మధు తదితరులు పాల్గొన్నారు.

## మహా రక్తదాన శిబిరంలో రక్త దానం చేసిన ఎమ్మెల్యే తనయుడు దిన్వేష్ రెడ్డి

**గిద్దలూరు పెన్ పవర్ జనవరి 18**

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు , మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు వర్ధంతి ని పురస్కరించుకొని తెలుగుదేశం పార్టీ నిర్వహించిన మహారక్తదాన శిబిరంలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి తనయుడు ముత్తుముల దిన్వేష్ రెడ్డి రక్త దానం చేసి యువతకు ఆదర్శనంగా నిలిచారు. రక్తదానం చేసిన తనయుణ్ణి తండ్రి ఎమ్మెల్యే అశోక్ రెడ్డి పండ్ల జ్యూస్ ఇచ్చి అభినందిచారు. ఈసందర్బంగా దిన్వేష్ రెడ్డి మాట్లాడుతూ అన్నిధానాల్లో రక్తదానం ఎంతో ప్రధానమైనది, ఈరక్తం ప్రమాదాల సమయంలో క్షతగాత్రులను కాపాడే అవకాశం ఉందని, యువత ముందుకు వచ్చి రక్తదానం చేసి ప్రాణ దాతలు కావాలని కోరారు.



# లక్ష్యసాధకు కష్టపడి, ఇష్టపడి చదవాలి

**బాల్యవివాహాలు నేరం -14 సంవత్సరాల లోపు పిల్లలందరూ చదువుకోవాలి**

**బాలలను పనిలో పెట్టుకుంటే చట్టరీత్యా నేరం -ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఓంకార్**







**గిద్దలూరు పెన్ పవర్ జనవరి18**

గిద్దలూరు శాఖ గ్రంథాలయం లో ఆదివారం గిద్దలూరు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివాహముల నిర్మూలన , బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి , మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఏ. ఓంకార్ ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థిని విద్యార్థులకు సమాజంలో ఉన్నత శిఖరాలకు ఎలా చేరుకోవాలో దిశా ,నిర్దేశం చేశారు.లక్ష్య సాధనకు క్రమశిక్షణతో కష్టపడాలని తెలియజేశారు. ఆడవారికి 18 సంవత్సరముల లోపు, మగవారికి 21 సంవత్సరాల లోపు వివాహం చేయటం చట్టరీత్యా నేరమన్నారు. అలాగే 14 సంవత్సరాల లోపు పిల్లలందరూ తప్పనిసరిగా చదువుకోవాలన్నారు.బాలలను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమన్నారు. చైల్డ్ లైన్ హెల్ప్ లైన్ నెంబర్ 1098 ,ఉచిత న్యాయ సహాయానికై నల్సా హెల్ప్ లైన్ నెంబర్ 15100 గురించి తెలియజేశారు. తర్వాత పిల్లలతో మనోవికాసానికై పలు ఆటలు నిర్వహించి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ ఎన్. ఎం. ప్రసన్నకుమారి, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు బి. రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి జి .కిషోర్, కార్యదర్శి సయ్యద్. ఫరూక్, పారా లీగల్ వాలంటీర్ అద్దంకి. మధుసూధనరావు, కోర్టు సిబ్బంది ,పలు స్కూళ్లకు సంబంధించిన బాల,బాలికలు పాల్గొన్నారు.

# తెలుగు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచివున్న వ్యక్తి ఎన్టీఆర్.

**గుడ్లూరులో ఘనంగా ఎన్టీఆర్ 30వ వర్ధంతి వేడుకలు.**





**గుడ్లూరు, పెన్ పవర్, జనవరి 18:**

టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షులు, ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి, విశ్వ విఖ్యాత నటసార్వభౌమ నందమూరి తారక రామారావు 30వ వర్ధంతి వేడుకలు మండల కేంద్రమైన గుడ్లూరులో మండల పార్టీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు ఆధ్వర్యంలో కూటమి శ్రేణుల సమక్షంలో అత్యంత భక్తిశ్రద్ధలతో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్‌కు మండల పరిధిలో ఉన్న తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొని ఘన నివాళులర్పించారు. టీడీపీ పార్టీ కార్యాలయం వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, టెంకాయలు కొట్టి ముఖ్యమంత్రిగా ఆయన చేసిన సేవలను వారు స్మరించుకుంటున్నారు. ఈ సందర్భంగా స్థానిక కూటమి నాయకులు మాట్లాడుతూ తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని ఎన్టీఆర్ చిరస్థాయిగా నిలిపారని, పేదల సంక్షేమానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఎన్టీఆర్ భౌతికంగా దూరమైనా ఆయన ఆశయాలు, జ్ఞాపకాలు తెలుగు ప్రజల హృదయాల్లో శాశ్వతంగా నిలిచి ఉంటాయని వారు అన్నారు. ఒకవైపు వెండితెరపై అద్వితీయమైన నటనతో కోట్లాది మంది అభిమానాన్ని చూరగొని, మరోవైపు రాజకీయాల్లోనూ తనదైన ముద్ర వేసి తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన యుగపురుషుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. ఆయన పాలనలో ప్రవేశపెట్టిన పథకాలు దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాలకు స్ఫూర్తినిచ్చాయని వారు గుర్తుచేసుకున్నారు. ముఖ్యంగా సమాజంలోని పేద వర్గాల సంక్షేమానికి ఎన్టీఆర్ పెద్దపీట వేశారని పేర్కొన్నారు. రెండు రూపాయలకే కిలో బియ్యం వంటి పథకాలతో పేదల ఆకలి తీర్చిన ఆయన దార్శనికతను, మహిళల అభ్యున్నతి, గ్రామీణాభివృద్ధి కోసం ఆయన అమలు చేసిన విధానాలు చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడ్డాయని వారు ప్రశంసించారు. ఆయన చూపిన మార్గంలో పయనిస్తూ, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ప్రతి తెలుగువాడి బాధ్యత అని నాయకులు ఉద్ఘాటించారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ప్రజాసేవకు పునరంకితం కావాలన్నారు. తదనంతరం అల్పాహారం ఏర్పాటుచేసి అందరికీ అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పువ్వాడి వేణు, దామా వెంకటేశ్వర్లు, గ్రామ పార్టీ అధ్యక్షులు ఉన్నం వెంకటేశ్వర్లు, కాపులూరి మాల్యాద్రి, రావూరి వేణు, చిత్తారు మల్లికార్జున, మేకపోతుల రాఘవులు, తెలుగు యువత చెన్నారెడ్డి మహేష్, కాపులూరి శ్రీను, మహిళ నాయకులు రమణమ్మ, పద్మ, మేకల మాల్యాద్రి, ఉమ్మనేని సుబ్బారావు, మద్దసాని కృష్ణ, బీజేపీ అధ్యక్షులు ఇన్నమూరి ప్రమీల సుధాకర్, జనసేన అధ్యక్షులు గిరిబాబు, కోకా చిరంజీవి, ఏసుదాస్, ఉమ్మడిపోలు హరిబాబు, సర్పంచ్ శంకర్, నాదెళ్ల సుబ్బారావు, మహిళ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వివిధ పంచాయితీల గ్రామ కమిటీల అధ్యక్షులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు ప్రజల గుండె చప్పుడు అన్న ఎన్టీఆర్

**తెలుగుదేశం పార్టీ నాయకుల కర్మాగారం.**

**కనిగిరి ఏఎంసీ చైర్మన్ యారవ రమాశ్రీనివాసలు,**

**మండల అధ్యక్షుడు బొల్లా నరసింహారావు**





**పెన్ పవర్, పామూరు, జనవరి 18**

తెలుగు ప్రజల గుండె చప్పుడు అన్న ఎన్టీఆర్ అని కనిగిరి ఏఎంసీ చైర్మన్ యారవ రమాశ్రీనివాసలు, మండల అధ్యక్షుడు బొల్లా నరసింహారావు పేర్కొన్నారు. పట్టణంలోని మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు అన్న నందమూరి తారక రామారావు 30వ వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు, పేదలకు పండ్లు పంపిణీ చేశారు. ఏఎంసీ చైర్మన్ యారవ రమాశ్రీనివాసలు, మండల అధ్యక్షుడు బొల్లా నరసింహారావు, పలువురు మాట్లాడుతూ మరణం లేని కారణ జన్ముడు అన్న ఎన్టీఆర్ అని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ రాజకీయ నేతల కర్మాగారం అన్నారు. కిలో రెండు రూపాయల బియ్యం, సామాజిక భద్రతా పింఛన్లు, పక్కా ఇళ్ల నిర్మాణం, రైతుకు విద్యుత్, మండల వ్యవస్థతో స్థానిక స్వపరిపాలన, ఆడబిడ్డలకు ఆస్తిలో హక్కు, రాయలసీమకు సాగు, తాగునీటి ప్రాజెక్టులు లాంటి అనితరసాధ్యమైన సంక్షేమ అభివృద్ధి పథకాలతో చరిత్ర గతిని మార్చిన ఆ మహనీయుని సేవలు మనకు ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ ఎస్టీల పారిశ్రామిక రాయితీల విడుదలకు 20న ధర్నా

**కార్పొరేషన్ పెన్ పవర్ , ఒంగోలు జనవరి 18**

ఎస్సీ ఎస్టీల పారిశ్రామిక రాయితీల విడుదల కోసం ఈ నెల 20న మంగళగిరిలోని ఏపీఐఐసీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు ఎస్సీ ఎస్టీ పారిశ్రామిక రాయితీల జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా కోఆర్డినేటర్ వి. భక్తవత్సలం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఆయన ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. గత ఐదు సంవత్సరాలుగా ఎస్సీ ఎస్టీల పారిశ్రామిక రాయితీల కోసం పలు విధాలుగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని, ప్రభుత్వం ఎప్పటికప్పుడు ఏదో ఒక విధంగా మభ్యపెడుతూ వస్తుందని భక్తవత్సలం పేర్కొన్నారు. గత ఆగస్టు నుండి ఇప్పటివరకు మూడుసార్లు సచివాలయం ముట్టడి, మంగళగిరిలోని ఏపిఐఐసి కార్యాలయం వద్ద పలుదఫాలుగా ధర్నాలు, గత డిసెంబర్ 6 నుంచి 13వ తేదీ వరకు 8 రోజులు పాటు నిరసన దీక్షలు, అర్ధనగ్న ప్రదర్శనలు చేపట్టడం జరిగిందని ఆయన వివరించారు. గత నెల 13వ తేదీన రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ ఇచ్చిన హామీని కూడా నెరవేర్చలేకపోయినట్లు తెలిపారు. సంక్రాంతికి రాయితీలు ఇస్తామని మంత్రి భరత్ ఆర్భాటంగా ప్రకటించి మాట తప్పిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. రాయితీలు విడుదల చేసేంతవరకు ఈ ధర్నా కార్యక్రమం కొనసాగించడం జరుగుతుందన్నారు. రాయితీలు పొందవలసిన ప్రతి పారిశ్రామికవేత్త ఈ ధర్నాలో పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అంతేకాక వివిధ పార్టీలు, ప్రజా సంఘాలు నాయకులు కూడా ఈ ధర్నాకు సంఘీభావం తెలపాలని భక్తవత్సలం కోరారు.

# ఎన్టీఆర్ చిరస్మరణీయులు







**పొదిలి, పెన్ పవర్, జనవరి 18**

తెలుగుదేశం వ్యవస్థాపకులు, దివంగత రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు చిరస్మరణీ యు లని పలువురు కొనియాడారు. ఆదివారం నాడు ఎన్టీఆర్ 30వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం నాడు పట్టణంలోని పాత బస్టాండ్ సెంటర్లో గల ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పేద ప్రజల గుండెల్లో నందమూరి తారక రామారావు ఎల్లప్పుడూ చిరస్మరణీయులుగా ఉంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మర్రిపూడి మండల పరిషత్ అధ్యక్షులు వాకా వెంకటరెడ్డి, పొదిలి మార్కెటింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ సయ్యద్ ఇమాంస, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి గురుపూడి భాస్కర్, నాయకులు కాటూరి వెంకటనారాయణ ప్రతాప్, రాష్ట్ర ఆరోగ్య సలహా సంఘం సభ్యురాలు డాక్టర్ స్వర్ణ గీత, తెలుగుదేశం మైనార్టీ విభాగపు నాయకులు షేక్ రసూల్ మహమ్మద్, షేక్ ఖాసిం తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ శత జయంతి ముగింపు ఉత్సవాల్లో కందుకూరు సిపిఐ నాయకులు



**కందుకూరు పెన్ పవర్, జనవరి 18**

స్వాతంత్రానికి ముందు 1925 వ సంవత్సరంలో భారత సమాజంలో అణగారిన వర్గాలకు అరుణతారగా అభయమిస్తూ నేనున్నానని కార్మిక, కర్షక, విద్యార్థి, యువజన, మహిళ, రైతు కూలీ, బలహీన వర్గాల ప్రజలకు అండగా నిలబడుతూ అలుపెరగని ఉద్యమం నిర్వహిస్తున్న భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ముగింపు ఉత్సవాలలో భాగంగా ఆదివారం తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మంలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఈ సభకు కందుకూరు సిపిఐ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కందుకూరు సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బూసి సురేష్ బాబు మాట్లాడుతూ కమ్యూనిస్టుల ఖిల్లాగా పేరు గడించిన ఖమ్మం జిల్లాలో నిర్వహించిన శతాబ్ది ముగింపు ఉత్సవాలకు భారీ స్థాయిలో సిపిఐ శ్రేణులు, కార్యకర్తలను చూస్తుంటే అంత ఎరుపుమయం అయినట్లు కనువిందుగా ఉందని ఈ శతాబ్ది ఉత్సవాలలో ముగింపు కార్యక్రమంలో కందుకూరు తరుపున మేము పాల్గొనడం మరింత సంతోషంగా ఉందని ఆయన అన్నారు. ఈ ఉత్సవాలకు దాదాపు 25 దేశాల నుండి సిపిఐ ప్రతినిధులు తోపాటు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని వారి సందేశాలను ఇవ్వడం చూస్తే రానున్న రోజుల్లో సిపిఐ అధికారంలోకి రాజన్న ప్రతి ఒక్కరికి నోటిమీద వేరే వేసుకునేలా ఉందని ఆయన అన్నారు. ఈ ముగింపు ఉత్సవాలలో సిపిఐ ప్రతినిధులు ప్రసంగంలో ప్రతి ఒక్క సిపిఐ కార్యకర్తకు మరో ధైర్యాన్ని ఇచ్చిందని ఆయన అన్నారు. మధ్య మధ్యలో ప్రజానాట్యమండలి గీతాలు, సినీ గాయకులు వందేమాతరం శ్రీనివాస్ గీతాలాపనలు అందరినీ అలరించాయి. కందుకూరు నుండి బహిరంగ సభకు పాల్గొన్న వారిలో నాయకులు ఆనందమోహన్, దుర్గాప్రసాద్, బొల్లోజుల బాల బ్రహ్మాచారి, పొట్లూరి శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలు ..

## భారీ రక్తదానం తో ఎన్టీఆర్ కు ఘన నివాళులు అర్పించిన తెలుగు తమ్ముళ్లు..

## ఎమ్మెల్యే ముత్తుముల పిలుపుతో రక్తదానం చేసిన 312 మంది తెలుగుతమ్ముళ్లు..









**గిద్దలూరు పెన్ పవర్ జనవరి 18**

తెలుగు జాతి గర్వించదగ్గ నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారకరామారావు వర్ధంతి వేడుకలు గిద్దలూరు పట్టణంలో అత్యంత ఘనంగా నిర్వహించబడ్డాయి. స్థానిక శాసనసభ్యులు ఏపీ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలు, సేవా కార్యక్రమాలతో హోరెత్తాయి. ముందుగా ఎమ్మెల్యే అశోక్ రెడ్డి ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి ఎన్టీఆర్ అని, పేదల అభ్యున్నతి కోసం ఆయన చేసిన కృషి మరువలేనిదని" కొనియాడారు. తెలుగు వారి ఆత్మగౌరవాన్ని ప్రపంచవ్యాప్తం చేసిన మహనీయుడు ఎన్టీఆర్ అని ఆయన పేర్కొన్నారు.

**హోరెత్తిన 'లెజెండరీ బ్లడ్ డొనేషన్ డ్రైవ్:**

ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన లెజెండరీ బ్లడ్ డొనేషన్ డ్రైవ్ కార్యక్రమానికి నియోజకవర్గ ప్రజల నుండి విశేష స్పందన లభించింది. ఎమ్మెల్యే ఒక్క పిలుపు తో సుమారు 312 మంది యువకులు, పార్టీ కార్యకర్తలు అభిమానులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. రక్తదానం చేసిన ప్రతి ఒక్కరిని ఎమ్మెల్యే స్వయంగా అభినందించారు. గతంలో కంటే అధిక సంఖ్యలో రక్తదానంలో పాల్గొనటం ఎన్టీఆర్ పట్ల ప్రజలకు ఉన్న అభిమానానికి నిదర్శనమన్నారు. ఈ రక్తదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే తనయుడు దివ్యేష్ రెడ్డి రక్తదానం చేసి ఎన్టీఆర్ కు నివాళులు అర్పించారు.. ఈ వర్ధంతి వేడుకల్లో జనసేన ఇన్చార్జ్ బెల్లంకొండ సాయిబాబు, నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు ముత్తుముల కృష్ణ కిషోర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు, మార్కెట్ యార్డ్ చైర్మన్లు, జడ్పీటీసీ సభ్యులు, సొసైటీ బ్యాంకు చైర్మన్లు, సర్పంచులు, పట్టణ కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, పార్టీ ముఖ్య నేతలు, కార్యకర్తలు, ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు.

# జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటా- ఇంచార్జి దద్దాల



**పెన్ పవర్ పామూరు జనవరి 18**

బీసీ సామాజిక వర్గానికి చెందిన,ఒక సామాన్య కార్యకర్తగా,జెడ్పీటీసీగా ఉన్న తనను పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయించిన లివైయస్ఆర్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైయస్ జగన్ మోహన్ రెడ్డి కి జీవితాంతం రుణపడి ఉంటానని కనిగిరి నియోజకవర్గం వైయస్ఆర్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ పేర్కొన్నారు. దద్దాల నారాయణ యాదవ్ ను ఇంచార్జిగా ప్రకటించి నేటికీ రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జగనన్న పట్టుదల,ధైర్యం,సాహసం, పోరాట పటిమ నాకు ఆదర్శం,స్ఫూర్తి అని అన్నారు. గౌరవ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్ మోహన్ రెడ్డి గారి అడుగుజాడల్లో నడుస్తూ, పార్టీ పిలుపునిచ్చిన ప్రతి కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తున్నట్లు తెలిపారు.ఇందులో భాగంగా అన్నదాతకు అండగా పోరుబాట,విధ్యుత్ చార్జీలు పెంపుపై పోరుబాట, విద్యార్థులకు అండగా యువత పోరు,ఫీజు పోరు, పొగాకు రైతులకు మద్దతు ధర కొరకై పోరాటం,రైతులకు అండగా జగనన్న పోరుబాట,కూటమి ప్రభుత్వం హామీల అమలు చేయడంలో విఫలం పై వెన్నుపోటు దినం కార్యక్రమం, హామీల అమలు చేయడంలో మోసంపై బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ మరియు నకిలీ మద్యంకు వ్యతిరేకంగా నిరసన ర్యాలీ, యూరియా పై అన్నదాత పోరు,కూటమి ప్రభుత్వం ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయడం పై నిరసనగా కోటిసంతకాల సేకరణ, అకాల వర్షం కారణంగా నియోజకవర్గం లో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ప్రజలకు అండగా ప్రజా కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఇవే కాకుండా వైయస్ రాజశేఖర్ రెడ్డి గారి జయంతులు, వర్ధంతులు మరియు జగనన్న పుట్టినరోజు, పార్టీ ఆవిర్భావ దినోత్సవాల సందర్భంగా అన్నదానం, మహిళలకు చీరల పంపిణీ, రక్తదానం,దివ్యాంగులకు దుప్పట్లు, ట్రై సైకిల్స్ పంపిణీ, ప్రభుత్వ ఆస్పత్రి లో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ, చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు పంపిణీ వంటి అనేక సేవా కార్యక్రమాలు గడిచిన రెండేళ్లలో చేపట్టినట్లు ఆయన తెలిపారు.కూటమి సర్కార్ చేసిన,చేస్తున్న తప్పిదాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ, ఎన్నికల హామీల అమలుకై పోరాడతానన్నారు. అదేవిదంగా పార్టీ జిల్లా అధ్యక్షులు బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, పార్టీ పార్లమెంట్ ఇంచార్జి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, జిల్లా పార్టీ రీజినల్ కో–ఆర్డినేటర్ కారుమూరి వెంకటనాగేశ్వరావు, జడ్పీ చైర్మన్ వెంకాయమ్మ , పెద్దలు రాజ్యసభ సభ్యులు వైవి సుబ్బారెడ్డి , పార్టీ పార్లమెంట్ పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి గారు,పార్టీ నియోజకవర్గం పరిశీలకులు కసుకుర్తి ఆదేన్న గారి ఆశీస్సులతో కనిగిరి నియోజకవర్గం పార్టీ శ్రేణులందరిని కలుపుకొని,కార్యకర్తలకు అన్ని విధాలుగా అండగా నిలబడి గ్రామస్థాయి నుండి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. రాబోయే ఎన్నికల్లో కనిగిరి నియోజకవర్గంలో వైయస్ఆర్‌సీపీ జెండా ఎగుర వేయడమే లక్ష్యంగా పనిచేస్తానన్నారు.మన ప్రియతమ నాయకుడు జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు శక్తికి మించి కృషి చేస్తానని,అహర్నిశలు శ్రమిస్తానన్నారు. సమన్వయకర్తగా నియమించిన నాటి నుండి నేటి వరకూ ఈ రెండేళ్లు నాకు మద్దతుగా నిలుస్తూ, నా వెంట నడుస్తూ నాకు అండగా నిలబడుతూ,నీకు మేమున్నాం అంటూ వెన్నుదన్నుగా తోడుగా నిలిచిన కనిగిరి నియోజకవర్గం వైయస్ఆర్‌సీపీ నాయకులకు,కార్యకర్తలకు,సోషల్ మీడియా సభ్యులకు,అభిమానులకు మరియు ప్రజల అందరికీ పేరు పేరునా ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు.మీరందరూ నాపై చూపించిన ప్రేమ, ఆప్యాయతలు నేను ఎప్పటికి మరిచిపోలేనన్నారు. పార్టీ గెలుపు కొరకు అందరం సమిష్టిగా పనిచేద్దామని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు.

# జాయింట్ కలెక్టర్ కు వీడ్కోలు చెప్పిన ఎమ్మార్పీఎస్ బృందం

**కందుకూరు పెన్ పవర్, జనవరి 18**

ప్రకాశం జిల్లాలో ఉన్న మాదిగల సమస్యలపై జిల్లా జాయింట్ కలెక్టర్ రోనంకి గోపాలకృష్ణ ని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి, ఎంఈఎఫ్ ప్రతినిధి బృందం కలిశారు. ప్రకాశం జిల్లాలో దాదాపు రెండు సంవత్సరాల పాటు ప్రకాశం జిల్లాలో జాయింట్ కలెక్టర్ గా దిగ్విజయంగా పనిచేసి సోమవారం బదిలీపై వెళ్తున్న సందర్భంగా జాయింట్ కలెక్టర్ ను ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు మున్నగి నాగరాజు మాదిగ నాయకత్వంలో ఎమ్మార్పీఎస్ ప్రతినిధి బృందం శాలువ , మొక్కను బహుకరించి ఘనంగా సత్కరించడం జరిగిందని ఎం ఎస్ పి రాష్ట్ర సీనియర్ నాయకులు వర్ల దేవదాసు మాదిగ తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా లో పేదల పక్షాన జేసీ తనదైన శైలిలో సమస్య ను పరిష్కరించడం లో తానే స్వయంగా ముందుకొచ్చి సమస్యలు పరిష్కరించారని పేదలకు వారు చేసిన సేవలను గుర్తించి వారికి ఎమ్మార్పీఎస్ పక్షాన సత్కరించి పూల మొక్కను అందించి భవిష్యత్ లో కూడా పేదల పక్షాన నిలవాలని కోరడమైనది అన్నారు. దానికి స్పందించిన జేసీ నేను ఈ సీటు లో ఉంది బలహీనులకు సర్వీస్ చేయడానికే అని గట్టిగా చెప్పారు. సుమారు రెండు సంవత్సరాలుగా మీరు చూపిన సహకారానికి ధన్యవాదాలు అని చెప్పి నాకు సన్మానించిన మీకు పేరు పేరు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం జిల్లా లో మాదిగ ప్రజలు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకు రావడం జరిగింది.వీటిపై వెంటనే జాయింట్ కలెక్టర్ స్పందిస్తూ నేను సోమవారం బదిలీ అయ్యి వెళ్తున్న దృష్ట్యా ఇప్పుడు తన దృష్టికి వచ్చిన సమస్యలను తప్పనిసరిగా జిల్లా కలెక్టర్ రాజా బాబూ దృష్టికి ఇప్పుడే తీసుకువెళ్లి చర్చిస్తానని మాట ఇచ్చారు.ఈ సమావేశంలో ఉమ్మడి ప్రకాశం ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర జాతీయ నాయకులు పాల్గొన్నారు.



## మెగా బ్లడ్ డొనేషన్ క్యాంపులో పాల్గొన్న కొమరోలు మండల తెలుగుదేశం పార్టీ నాయకులు.

**రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచిన పలువురు నాయకులు.**

**రక్తదానం చేసిన నాయకులకు ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించిన ఎమ్మెల్యే అశోక్ రెడ్డి ఆయన సోదరుడు కృష్ణ కిషోర్ రెడ్డి.**





**కొమరోలు పెన్ పవర్ జనవరి 18**

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు ,రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్టీ రామారావు వర్ధంతిని పురస్కరించుకొని గిద్దలూరులో నిర్వహించిన మెగా బ్లడ్ డొనేషన్ క్యాంపు లో పాల్గొనేందుకు కొమరోలు మండలం నుండి పలువురు తెలుగుదేశం పార్టీ జనసేన పార్టీ నేతలు, కార్యకర్తలు ఆదివారం ఉదయం తరలి వెళ్లారు. స్వర్గీయ ఎన్టీ రామారావు వర్ధంతిని పురస్కరించుకొని గిద్దలూరు లోని విట్టా సుబ్బరత్నం కళ్యాణ మండపంలో ఆదివారం గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి ఆధ్వర్యంలో మెగా బ్లడ్ డొనేషన్ క్యాంపు నిర్వహించారు. గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి పిలుపుమేరకు కొమరోలు సహకార సంఘం చైర్ పర్సన్ ముత్తుముల సంజీవరెడ్డి, ఎడమ కళ్ళు సహకార సంఘం చైర్ పర్సన్ బిజ్జం రవీంద్రారెడ్డి, గిద్దలూరు మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ గోడి ఓబుల్ రెడ్డి ,డైరెక్టర్లు షేక్ హసీనా, గజ్జలకొండ నారాయణ, తిరుమల రెడ్డి బాదినేని పల్లె గ్రామపంచాయతీ యూనిట్ కన్వీనర్ ముత్తుముల ఎల్లారెడ్డి, కొమరోలు వార్డు మెంబర్ షేక్ సుభాని ,పాలు గుల్ల మల్లికార్జునరెడ్డి తో పాటు కార్యకర్తలతో కలిసి గిద్దలూరు తరలి వెళ్లారు .ఆ సందర్భంగా గిద్దలూరు లో ఏర్పాటుచేసిన ఎన్టీ రామారావు వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని నివాళులర్పించారు అనంతరం విట్టా సుబ్బరత్నం కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన మెగా బ్లడ్ డొనేషన్ క్యాంపులో భాగస్వాములై రక్తాన్ని డొనేట్ చేశారు. రక్తాన్ని రక్తాన్ని డొనేట్ చేసిన ముత్తుముల ఎల్లారెడ్డి, షేక్ హసీనా తదితర నేతలను, కార్యకర్తలను ఎమ్మెల్యే అశోక్ రెడ్డి ఆయన సోదరుడు కృష్ణ కిషోర్ రెడ్డి ప్రశంస పత్రాలు అందజేసి అభినందించారు.

# రక్తదానం చేసిన ఎమ్మెల్యే ఇంటూరి

## -రక్తదానం చేసిన టిడిపి నాయకులు

## -రక్తదానానికి విశేష స్పందన -300 మందికి పైగా రక్తదానం










**కందుకూరు పెన్ పవర్, జనవరి 18**

రక్తదానం మహాదానం అని అపోహలు వీడి ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడం ముందుకు రావాలని స్థానిక శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా వెంగమాంబ కళ్యాణ మండపంలో ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరంను ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, మాజీ శాసనసభ్యులు దివి శివరాంతో కలిసి ప్రారంభించారు. ఈ శిబిరంలో 300 మందికి పైగా రక్తదానం చేశారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు స్వయంగా రక్తదానం చేయడంతో ఆయన స్ఫూర్తితో అనేకమంది నాయకులు ముందుకు వచ్చారు. పలువురు పార్టీ నాయకులు చల్లా నాగేశ్వరరావు, వడ్లమూడి సురేష్, పొడపాటి మహేష్, ముచ్చు వేణు, మండవ దశరథ, ముచ్చు లక్ష్మీరాజ్యం, అబ్బూరి వేణు, పల్లపోతు వెంగళరావు, కార్యకర్తలు రక్తదానం చేశారు. ప్రధానంగా యువత, మహిళలు స్వచ్ఛందంగా తరలివచ్చి రక్తం ఇచ్చారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన వారందరినీ ఎమ్మెల్యే నాగేశ్వరరావు పలకరించి అభినందించారు. రక్త దాతలకు సర్టిఫికెట్లు అందించారు. ఎన్టీఆర్ ట్రస్ట్ క్యాలెండర్, డైరీలను ఎమ్మెల్యే నాగేశ్వరరావు ఆవిష్కరించారు. శిబిరంలో సేవలందించిన తెలుగు నాడు పారామెడికల్ సిబ్బంది, తెలుగు యువతను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు.

# పారిశుధ్య కార్మికులకు బట్టలు పంపిణీ



**కార్పొరేషన్ పెన్ పవర్, ఒంగోలు జనవరి 18**

మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారక రామారావు 30 వ వర్ధంతి సందర్భంగా 48 వ డివిజన్ లో పారిశుధ్య కార్మికులకు స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు బట్టలు పంపిణీ చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు ఒంగోలు శాసన సభ్యులు దామచర్ల జనార్ధన్ రావు ఆదేశాల మేరకు పెళ్లూరు చిన్న వెంకటేశ్వర్లు ఆధ్వర్యం లో 48 వ డివిజన్ తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుమ్మళ్ళ సుబ్బారావు, వేమూరి మాల్యాద్రి, వేమూరి శ్రీనివాసరావు, పాలపర్తి లక్ష్మీనారాయణ, పాదర్తి సుబ్బారావు,ఎం.మహేష్, టి.రమాదేవి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# 30 గ్రామాలకు నిలిచిన నీటి సరఫరా



**తాళ్లూరు, పెన్ పవర్, జనవరి 18**

వేతనాలు ఇవ్వకపోవడంతో కార్మికులు ఆదివారం సుమారు 30 గ్రామాలకు నీటి సరఫరాను నిలిపివేశారు. రామతీర్థం జలాశయం పథకం ద్వారా మంచినీటిని సరఫరా చేస్తున్న వారిలో 14 మంది కార్మికులు పని చేస్తున్నారు. వారికి 6 నెలలుగా కాంట్రాక్టర్ వేతనాలు చెల్లించకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో మండలంలోని 30 గ్రామాలకు మంచినీటి సరఫరాను నిలిపివేశారు.

# ఆస్తుల రక్షణ కోసమే జగన్ పార్టీ..
# ఆత్మగౌరవం కోసం ఎన్టీఆర్ పార్టీ...

## భవిష్యత్ తరాల కోసమే చంద్రబాబు దావోస్ పర్యటన: మంత్రి గొట్టిపాటి రవికుమార్

## బొడ్డువానిపాలెంలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ.. రూ. 1.30 కోట్ల పనులు ప్రారంభం



**అద్దంకి ఆర్సి ఇంచార్జ్, పెన్ పవర్, జనవరి 18:**

తెలుగు వారి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పేందుకు స్వర్గీయ నందమూరి తారక రామారావు గారు తెలుగుదేశం పార్టీని స్థాపిస్తే, కేవలం తన ఆస్తులను కాపాడుకోవడం కోసం, కేసుల నుంచి బయటపడేందుకే జగన్ మోహన్ రెడ్డి పార్టీ పెట్టారని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ గారు తీవ్రంగా విమర్శించారు. అద్దంకి నియోజకవర్గం, కొరిశపాడు మండలం, బొడ్డువానిపాలెం గ్రామంలో ఆదివారం పర్యటించిన మంత్రి, స్వర్గీయ ఎన్టీఆర్ 30వ వర్ధంతి సందర్భంగా వారి విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ తెలుగు ప్రజల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా తెలుగుదేశం పార్టీ పని చేస్తోందని, అందుకే ప్రజలు పార్టీని గుండెల్లో పెట్టుకున్నారని అన్నారు. పార్టీకి సంక్షోభం వచ్చిన ప్రతీసారీ అధినేత చంద్రబాబు నాయుడు గారు అండగా నిలిచి గట్టెక్కిస్తున్నారని, ఆయన కార్యదక్షత వల్లే కోటి సభ్యత్వాలు కలిగిన ఏకైక పార్టీగా తెలుగుదేశం నిలిచిందని మంత్రి గొట్టిపాటి పేర్కొన్నారు. రాష్ట్ర యువతకు ఉజ్వల భవిష్యత్తును అందించడమే చంద్రబాబు గారి తపన అని, భవిష్యత్ తరాల వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు వేల కోట్ల పెట్టుబడులు తీసుకురావడమే లక్ష్యంగా ఆయన మళ్లీ దావోస్ పర్యటనకు వెళ్తున్నారని తెలిపారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూనే, పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేస్తున్న ఘనత



చంద్రబాబు గారిదేనని కొనియాడారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా ఈ పర్యటనలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ గారు మొత్తం రూ. 1.30 కోట్ల విలువైన అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఇందులో రూ. 30 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన కాపు కమ్యూనిటీ భవన్ మరియు ముఖద్వారంతో పాటు, రూ. 1 కోటి వ్యయంతో నిర్మించిన అంతర్గత సిమెంట్ రోడ్లు, సైడ్ డ్రైన్స్ ఉన్నాయి. కార్యక్రమ అనంతరం మంత్రి గొట్టిపాటి పార్టీ కార్యకర్తలతో ఆప్యాయంగా మమేకమయ్యారు. అక్కడికి విచ్చేసిన కార్యకర్తలను పేరుపేరునా పలకరిస్తూ, ప్రతి ఒక్కరితో కరచాలనం చేసి ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# సుందర్ స్థానంలో ఆల్ రౌండర్ కాకుండా స్పిన్నర్‌కు ఛాన్స్ ..



**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ గాయం కారణంగా న్యూజిలాండ్‌తో జరిగే టీ20 సిరీస్‌కు దూరమయ్యాడు. సెలెక్టర్లు అతని స్థానంలో లెగ్ స్పిన్నర్ రవి బిష్ణోయ్‌ను జట్టులోకి తీసుకున్నారు. వడోదరలో కివీస్‌తో జరిగిన తొలి వన్డేలో బౌలింగ్ చేస్తున్నప్పుడు సుందర్ పక్కటెముకల కండరాల గాయానికి గురయ్యాడు. కొన్ని రోజులు విశ్రాంతి తీసుకోవాలని డాక్టర్లు సూచించగా.. అతను బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు వెళ్తాడని బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా శుక్రవారం ప్రకటించారు. అయితే సుందర్ స్థానంలో ఇప్పుడు స్పెషలిస్ట్ స్పిన్నర్ ను ఎంపిక చేయడం చర్చనీయాంశంగా మారుతోంది.

స్వదేశంలో వరల్డ్ కప్ జరగడంతో టీమిండియాకు స్పిన్ ఆల్ రౌండర్ కంటే స్పెషలిస్ట్ స్పిన్నర్ అవసరం ఎక్కువగా ఉంది. పైగా సుందర్ ను రీప్లేస్ చేసే స్పిన్ ఆల్ రౌండట జట్టులో లేదు. కృనాల్ పాండ్య అంతర్జాతీయర్ క్రికెట్ ఆడి నాలుగు సంవత్సరాలు దాటింది. నేరుగా వరల్డ్ కప్ కు తీసుకొని వచ్చి ఆడించడం రిస్క్ అవుతోంది. మరోవైపు రియాన్ పరాగ్ రూపంలో స్పిన్ ఆప్షన్ ఉన్నప్పటికీ ఈ యువ క్రికెటర్ పూర్తి ఫిట్ నెస్ తో లేదని తెలుస్తోంది. ఈ సంగతి పక్కన పెడితే వరల్డ్ కప్ స్క్వాడ్ లో కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి రూపంలో ఇద్దరు స్పిన్నర్లు మాత్రమే ఉన్నారు. స్వదేశంలో స్పిన్ ట్రాక్స్ ఉండడంతో సెలక్టర్లు బిష్ణోయ్ వైపే మొగ్గు చూపారు.

**తొలి వన్డే ఆడుతూ సుందర్ కు గాయం:**

ఆదివారం (జనవరి 11) వడోదర వేదికగా జరిగిన తొలి వన్డేలో సుందర్ బౌలింగ్ చేస్తూ అసౌకర్యానికి గురయ్యాడు. 5 ఓవర్లు బౌలింగ్ చేసి 27 పరుగులు ఇచ్చి మ్యాచ్ మధ్యలోనే వైదొలిగాడు. ఆ తర్వాత బ్యాటింగ్ జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు 8వ స్థానంలో బ్యాటింగ్ చేయడానికి వచ్చాడు. మ్యాచ్ తర్వాత సుందర్ కు ఎడమ పక్కటెముకలు

గాయం అయినట్టు తేలింది. సుందర్ కు సైడ్ స్ట్రెయిన్ ఉందని మ్యాచ్ తర్వాత స్కాన్ కోసం వెళ్తాడని మ్యాచ్ తర్వాత కెప్టెన్ గిల్ తెలిపాడు. ఈ టూర్ లో టీమిండియా ప్లేయర్లకు గాయాల బెడద కొనసాగుతూనే ఉంది. తొలి వన్డేకు ముందు వికెట్ కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్ గాయపడి సిరీస్ మొత్తానికి దూరమైన సంగతి తెలిసిందే. అంతకముందు తెలుగు కుర్రాడు తిలక్ వర్మ గజ్జల్లో గాయం కారణంగా కివీస్ తో జరగబోయే తొలి మూడు టీ20లకు దూరమయ్యాడు.

# RCB పట్టిందల్లా బంగారమే.. టీమిండియా యంగ్ ప్లేయర్ మ్యాచ్ విన్నింగ్ స్పెల్





**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2026 సీజన్ లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు మరింత పటిష్టంగా మారనుంది. డిఫెండింగ్ ఛాంపియన్ ఆర్సీబీ ఐపీఎల్ 2026 మెగా ఆక్షన్ లో కొనుగోలు చేసిన ఇండియన్ యంగ్ ప్లేయర్ ప్రస్తుతం జరుగుతున్న అండర్-19 వరల్డ్ కప్ లో అదరగొడుతున్నాడు. శనివారం (జనవరి 17) బంగ్లాదేశ్ తో జరిగిన మ్యాచ్ లో విహాన్ అద్భుతమైన స్పెల్ తో మ్యాచ్ ను గెలిపించాడు. ఛేజింగ్‌లో బంగ్లా 17.2 ఓవర్లకు 90/2తో పటిష్ట స్థితిలో నిలిచింది. ఈ టైమ్‌లో వర్షం వచ్చి గ్రౌండ్ చిత్తడిగా మారడంతో ఆట ఆగింది. దాంతో బంగ్లా టార్గెట్‌ను 29 ఓవర్లలో 165 రన్స్ గా సవరించారు. ఆట తిరిగి మొదలయ్యాక ఇండియా బౌలర్లు అద్భుత పెర్ఫామెన్స్ చేశారు. ఫిఫ్టీ పూర్తి చేసుకొని జోరు మీదున్న అజిజుల్ హకీం (51)ను ఔట్ చేసిన ఖిలాన్ పటేల్ కీలక బ్రేక్ ఇచ్చాడు. ఇక్కడ నుంచి విహాన్ మల్హోత్రా షో సాగింది. మల్హోత్రా ధాటికి సిద్ధిఖీ (15), జిబాన్ (7) రిజాన్ (15), సుమియున్ (2) పెవిలియన్ బాట పట్టడంతో బంగ్లా 28.3 ఓవర్లలో 146 రన్స్‌కు ఆలౌటై ఓడిపోయింది. మ్యాచ్ ను గెలిసిపించిన విహాన్‌కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది. ఓవరాల్ గా ఈ మ్యాచ్ లో విహాన్ మల్హోత్రా 4 ఓవర్లలో 14 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టాడు. ఐపీఎల్ 2026 మినీ ఆక్షన్ లో 19 ఏళ్ళ విహాన్ ను రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు బేస్ ప్రైస్ రూ. 30 లక్షలకు దక్కించుకుంది. గత సీజన్ లో జరిగిన మెగా ఆక్షన్ లో ఆర్సీబీ కొన్న ఆటగాళ్లు అందరూ అద్భుతంగా రాణించారు. ఈ సారి కూడా 2026 సీజన్ కు ముందు ఆర్సీబీ ప్లేయర్స్ ఆకట్టుకుంటున్నారు.

**బంగ్లాపై ఇండియా థ్రిలింగ్ విక్టరీ:**

అండర్-19 వరల్డ్ కప్‌లో యంగ్ ఇండియా వరుసగా రెండో విజయం సొంతం చేసుకుంది. ఓటమి ఖాయం అనుకున్న దశలో స్పిన్నర్ విహాన్ మల్హోత్రా (4/14) చేసిన మ్యాజిక్‌తో శనివారం జరిగిన గ్రూప్‌బి మ్యాచ్‌లో 18 రన్స్ తేడాతో (డక్‌వర్త్ లూయిస్) బంగ్లాదేశ్‌పై థ్రిల్లింగ్ విక్టరీ సాధించింది. వర్షం అంతరాయం కలిగించడంతో 49 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఇండియా 48.4 ఓవర్లలో 238 రన్స్‌కు ఆలౌటైంది. అభిజ్ఞాన్ కుందు (112 బాల్స్‌లో 4 ఫోర్లు, 3 సిక్సర్లతో 80), యంగ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ (67 బాల్స్‌లో 6 ఫోర్లు, 3 సిక్సర్లతో 72) సత్తా చాటారు. బంగ్లాదేశ్ పేసర్ అల్ ఫహాద్ (5/38) ధాటికి కెప్టెన్ ఆయుష్ మాత్రే (6), వేదాంత్ (0), విహాన్ (7), హర్వాన్ష్ (2), అంబరీష్ (5) పెవిలియన్‌కు క్యూ కట్టినా.. వైభవ్, కుందు జట్టును ఆదుకున్నారు. అనంతరం ఛేజింగ్‌లో బంగ్లా 17.2 ఓవర్లకు 90/2తో పటిష్ట స్థితిలో నిలిచింది. ఈ టైమ్‌లో వర్షం వచ్చి గ్రౌండ్ చిత్తడిగా మారడంతో ఆట ఆగింది. దాంతో బంగ్లా టార్గెట్‌ను 29 ఓవర్లలో 165 రన్స్ గా సవరించారు. 165 పరుగుల టార్గెట్ లో బంగ్లాదేశ్ 146 పరుగులు ఆలౌటైంది.

# కోహ్లీ వీరోచిత సెంచరీ... అయినా ఓడిపోయిన టీమిండియా... కివీస్ దే సిరీస్

- **మూడో వన్డేలో టీమిండియాపై న్యూజిలాండ్ ఘన విజయం**
- **1-2 తేడాతో వన్డే సిరీస్‌ను కోల్పోయిన భారత్**
- **విరాట్ కోహ్లీ అద్భుత శతకం వృథా**
- **డారిల్ మిచెల్, గ్లెన్ ఫిలిప్స్ సెంచరీలతో చెలరేగిన కివీస్**
- **రాణించిన యువ ఆటగాళ్లు నితీశ్ రెడ్డి, హర్షిత్ రానా**







**హైదరాబాద్ పెన్ పవర్:** భారత పర్యటనలో ఉన్న న్యూజిలాండ్ జట్టు వన్డే సిరీస్‌ను కైవసం చేసుకుంది. ఇండోర్ వేదికగా జరిగిన మూడో, చివరి వన్డేలో టీమిండియాపై 41 పరుగుల తేడాతో కివీస్ విజయం సాధించింది. ఈ గెలుపుతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-1 తేడాతో చేజిక్కించుకుంది. విరాట్ కోహ్లీ అద్భుత శతకంతో పోరాడినా జట్టును గెలిపించలేకపోయాడు. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న భారత్‌కు కివీస్ బ్యాటర్లు చుక్కలు చూపించారు. డారిల్ మిచెల్ (137), గ్లెన్ ఫిలిప్స్ (106) అద్భుత శతకాలతో చెలరేగడంతో న్యూజిలాండ్ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 337 పరుగులు భారీ స్కోరు సాధించింది. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రానా చెరో మూడు వికెట్లు పడగొట్టారు.అనంతరం 338 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో టీమిండియాకు ఆశించిన ఆరంభం దక్కలేదు. టాప్ ఆర్డర్ విఫలమైనా, విరాట్ కోహ్లీ (124) ఒంటరి పోరాటం చేశాడు. కాగా, కోహ్లీకి వన్డేల్లో ఇది 54వ సెంచరీ. అతనికి యువ ఆటగాళ్లు నితీశ్ కుమార్ రెడ్డి (53), హర్షిత్ రానా (52) అర్ధశతకాలతో అండగా నిలిచారు . అయినప్పటికీ, కీలక సమయంలో వికెట్లు కోల్పోవడంతో భారత్ 46 ఓవర్లలో 296 పరుగులకే ఆలౌట్ అయి ఓటమిపాలైంది.

కివీస్ బౌలర్లలో క్రిస్టియన్ క్లార్క్, జాకరీ ఫౌల్క్స్ చెరో మూడు వికెట్లు తీసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు.




# చీరకట్టులో సంయుక్త అందాలు.. ఆ సోయగానికి ఫిదా!

సంయుక్త మీనన్.. పవన్ కళ్యాణ్ హీరోగా రానా కీలక పాత్రలో పోషిస్తూ వచ్చిన భీమ్లా నాయక్ సినిమాలో రానాకి జోడిగా.. తన అద్భుతమైన నటనతో అందరి దృష్టిని ఆకర్షించింది. ఇకపోతే పలు చిత్రాలతో ప్రేక్షకులను మెప్పించిన ఈమె గత ఏడాది బాలకృష్ణ హీరోగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో వచ్చిన అఖండ సీక్వెల్ అఖండ 2 సినిమాలో నటించి తన అద్భుతమైన నటనతో ఆకట్టుకుంది. ఇక ఈ ఏడాది శర్వానంద్ హీరోగా వచ్చిన నారీ నారీ నడుమ మురారి సినిమాలో హీరోయిన్గా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. సంక్రాంతి సందర్భంగా వచ్చిన ఈ సినిమా మంచి కామెడీ ఎంటర్టైన్మెంట్ మూవీ అని చెప్పవచ్చు.

ఇకపోతే ప్రస్తుతం సంక్రాంతి సందర్భంగా థియేటర్లలోకి వచ్చిన నేపథ్యంలో మరొకవైపు తన అందంతో అభిమానులను ఆకట్టుకునే ప్రయత్నం చేసింది ఈ ముద్దుగుమ్మ. తాజాగా పట్టుచీర కట్టుకొని అభిమానులను ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. ముఖ్యంగా భిన్నభిన్నమైన ఫోజులు ఇస్తూ ప్రేక్షకులను మెస్మరైజ్ చేసింది. సింపుల్ హెయిర్ స్టైల్ తో జడలో మల్లె పువ్వులు పెట్టుకొని చేతిలో తామర పువ్వు పట్టుకొని ఏదో ఆలోచిస్తూ ఫోటోలకు ఫోజులిచ్చింది. ముఖ్యంగా పెద్ద జుంకాలతో తన అందాన్ని రెట్టింపు చేసుకున్న ఈమె మెడలో ఏమీ లేకపోయినా తన అందంతో అభిమానులను ఆకట్టుకుంది..మొత్తానికైతే సంయుక్త మీనన్ షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్గా మారుతున్నాయి. 2016లో పాప్ కార్న్ అనే మలయాళం చిత్రంతో హీరోయిన్గా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి.. తమిళ్, కన్నడ, తెలుగు సినిమాలలో నటిస్తూ తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపును సొంతం చేసుకుంది. భీమ్లా నాయక్ సినిమాతో సినీ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన ఈమె.. కళ్యాణ్ రామ్ హీరోగా నటించిన బింబిసారా సినిమాతో మంచి విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. తర్వాత కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ నేరుగా తెలుగులో చేసిన చిత్రం సార్. ఈ సినిమాలో టీచర్ పాత్రలో నటించి తన అద్భుతమైన నటనతో అందరి దృష్టిని ఆకట్టుకుంది.ఇక ఆ తర్వాత వచ్చిన విరూపాక్ష సినిమాలో మరోసారి తన నటనతో మంచి మార్కులు వేయించుకుందని చెప్పవచ్చు. హీరోయిన్గా ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈమె.. ఇందులో డెవిల్ పాత్రలో అందరిని భయపెట్టేసింది. అలా తన పర్ఫామెన్స్ తో మెప్పిస్తున్న ఈమె ఇప్పుడు నారి నారి నడుమ మురారి చిత్రంలో మరోసారి మెప్పించింది. ఇక ప్రస్తుత సినిమాల విషయానికి వస్తే.. నిఖిల్ హీరోగా నటిస్తున్న స్వయంభు సినిమాలో నటిస్తోంది. ఇందులో మరో హీరోయిన్ నభా నటేష్ కూడా నటిస్తున్న విషయం తెలిసిందే. ఇక తర్వాత మహారాగ్ని అనే హిందీ సినిమాలో నటిస్తోంది. అంతేకాకుండా రామ్ అనే మలయాళం చిత్రంలో నటిస్తున్న ఈమె.. బెంజ్ అనే తమిళ చిత్రంలో కూడా నటిస్తోంది. అంతేకాదు విజయ్ సేతుపతి, పూరీ జగన్నాథ్ కాంబినేషన్లో వస్తున్న స్లమ్ డాగ్ అనే సినిమాలో కూడా హీరోయిన్గా నటిస్తోంది.

# అనీల్ 10వ సినిమా కోసం 50 రోజులా!

డైరెక్టర్లలలో వేగంగా కథ రాసి సినిమా పూర్తి చేసే దర్శకుడు ఎవరు? అంటే మొన్నటి వరకూ అంతా డ్యాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాధ్ పేరు జపించేవారు. కానీ పూరి ఫెయిల్యూర్స్ లో ఉండటంతో పాటు, స్పీడ్ కూడా తగ్గించడంతో? ఇప్పుడా స్థానాన్ని కోల్పోయారు. ఆ స్థానంలో హిట్ మెషిన్ అనీల్ రావిపూడి ఆక్రమించాడు. అనీల్ ఇప్పటి వరకూ తొమ్మిది సినిమాలు డైరెక్ట్ చేసాడు. అవన్నీ బ్లాక్ బస్టర్లే. కమర్శియల్ గా మంచి వసూళ్లను సాధించాయి. ఈ సినిమాల షూటింగ్ అంతా కూడా వేగంగా పూర్తి చేసి ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చాడు. దాదాపు అన్ని సినిమాలు నెలల వ్యవధిలోనే పూర్తి చేసి రిలీజ్ చేసాడు. ఈ సినిమాల స్టోరీలు సిద్దం చేయడం కోసం అనీల్ తీసుకున్నది చాలా తక్కువ సమయమే. ఒకే ఒక్క సినిమా స్టోరీ సిద్దం చేయడం కోసం మూడు నెలలు సమయం కేటాయించిగా, మిగతా ఎనిమిది సినిమాలకు నెలలోపే కేటాయించాడు. ఇటీవలే రిలీజ్ అయిన -మన శంకరవరప్రసాద్ గారు- కథకు అనీల్ తీసుకున్న సమయం కేవలం 25 రోజులే. వైజాగ్ పార్క్ హోటల్ లో సిట్టింగ్ వేసి 25 రోజుల్లోనే స్టోరీ సిద్దం చేసి హైదరాబాద్ వచ్చాడు. ఇప్పుడాసినిమా వందల కోట్ల వసూళ్లు దిశగా దూసుకుపోతుంది. 25 రోజుల్లోనే ఇంత గొప్ప కథ రాసిన అనీల్ ఇంకా ఎక్కువ సమయం కేటాయిస్తే ఇంకా మంచి కథ రాస్తాడు కదా? అన్న సందేహం చాలా మందిలో ఉంది.కానీ అనీల్ అందుకు వ్యతిరేకం. తాను నమ్మిన ఫార్మెట్ ని మాత్రం ఎప్పటికీ వదలనంటున్నాడు. స్టోరీ విషయంలో రోజుల్లోనూ పూర్తి చేయాలన్నది అతడి ప్లాన్. ఈ నేపథ్యంలో అనీల్ 10వ సినిమా స్టోరీ అప్ డేట్ కూడా తెరపైకి వస్తోంది. ఈ సినిమా కోసం అనీల్ 50 రోజులు సమయం కేటాయించాలనుకుంటున్నాడుట. 45 నుంచి 50 రోజుల మధ్యలో పూర్తయ్యే అవకాశం ఉందంటున్నారు. అదే పార్క్ హోటల్ బీచ్ ముందు కూర్చుని స్టోరీ సిద్దం చేయనున్నాడు. మరో రెండు వారాల తర్వాత అనీల్ నేరుగా వైజాగ్ చేరుకుంటాడని సన్నిహితుల నుంచి తెలిసింది. ఈసారి కూడా కథ పరంగా చాలా సింపుల్ గానే ఉంటుందని..హీరో ఇమేజ్ ఆధారంగా స్టోరీ సిద్దం చేసే అవకాశాలున్నాయంటున్నారు.హీరో ఎవరు? అన్నది అనీల్ కూడా ఫిక్స్ అయ్యాడన్నది తాజా అప్ డేట్. అయితే ఆ హీరో పేరు మాత్రం రివీల్ చేయలేదు. స్టోరీ పూర్తయిన తర్వాత ఆ హీరోకి నేరేట్ చేసే వరకూ ఆ వివరాలు గోప్యంగా ఉంటాయంటున్నారు. ఈ కథలో కూడా హీరో ఇన్వాల్వ్ మెంట్ ఉండదని అనీల్ పూర్తి స్వేచ్ఛతో చేసే మరో ఎంటర్ టైనింగ్ స్క్రిప్ట్ గానే ఉంటుందని అంటున్నారు. దీనికి సంబంధించి మరింత సమాచారం ఫిబ్రవరిలో బయటకు వచ్చే అవకాశం ఉంది. అయితే అనీల్ హీరోగా ఇప్పటికే కింగ్ నాగార్జునను ఫిక్సైనట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది.



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2230, editorpenpower@gmail.com